మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు
NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 5-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 6 Issue: 6

05 జూలై 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:50 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి పంచమి మ. 1:27 వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం శతభిష మ. 2:59 వరకు తరువాత పూర్వాభాద్ర యోగం ఆయుష్మాన్ సా. 4:35 వరకు కరణం తైతుల మ. 1:27 వరకు గరజి రా. 1:41ం వరకు వర్జ్యం రా. 9:50 నుండి రా. 11:30 వరకు దుర్ముహూర్తం సా. 5:06 నుండి సా. 5:58 వరకు రాహుకాలం సా. 5:13 నుండి సా. 6:50 వరకు యమగండం మ. 12:20 నుండి మ. 1:58 వరకు గుళికాకాలం మ. 3:35 నుండి సా. 5:13 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:14 నుండి తె. 5:02 వరకు అమృత ఘడియలు ఉ. 7:32 నుండి ఉ. 9:14 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:54 నుండి మ. 12:46 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Pubilished From Jagitial
www.evarthalu.com



## అల్లూరి ఆశయాలే నిజమైన నివాళి

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నివాళులు**

**ట్యాంక్‌బండ్‌లో జయంతి వేడుకలు**

**హైదరాబాద్, జులై 4**

సమాజంలో అన్యాయాన్ని ప్రశ్నించడం, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడమే మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు అందించే నిజమైన నివాళి అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా హైదరాబాద్ (మిగతా 2వ పేజీలో)






## జోధ్‌పూర్ విమానాశ్రయానికి నూతన టెర్మినల్

### ప్రధాని చేతుల మీదుగా ప్రారంభం

**రూ.480 కోట్లతో నిర్మాణం.. పర్యాటకానికి కొత్త ఊతం**

"రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ విమానాశ్రయంలో నిర్మించిన అత్యాధునిక నూతన టెర్మినల్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. అభివృద్ధి, వారసత్వ పరిరక్షణకు సమ ప్రాధాన్యం కల్పించే దిశగా నిర్మించిన ఈ టెర్మినల్ మార్వార్ ప్రాంతానికి మెరుగైన విమాన అనుసంధానాన్ని అందించడంతో పాటు పర్యాటకం, వాణిజ్యం, ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు కల్పిస్తుందని పేర్కొన్నారు."

**జోధ్‌పూర్, జులై 4**

సుమారు రూ.480 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ నూతన టెర్మినల్‌లో ఆధునిక సదుపాయాలు కల్పించారు. ప్రయాణికులకు వేగవంతమైన సేవలు, విశాలమైన నిరీక్షణ మందిరాలు, మెరుగైన భద్రతా వ్యవస్థ, (మిగతా 2వ పేజీలో)



## ట్రంప్ కొత్త ప్రతిపాదన..!

**మాజీ అధ్యక్షులకు ఆహ్వానం**

**వైట్‌హౌస్‌లో ఫుట్‌బాల్ మ్యాచ్**

**పాడ్‌కాస్ట్‌లో ఆసక్తికర వ్యాఖ్యలు**

**వాషింగ్టన్, జులై 4**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన వ్యాఖ్యలతో చర్చనీయాంశంగా మారారు. మాజీ అధ్యక్షులు బరాక్ ఒబామా, జో బైడెన్, బుష్ కుటుంబ (మిగతా 2వ పేజీలో)





## ప్రజాసేవలో రెండు దశాబ్దాలు

**రేవంత్ రాజకీయ ప్రస్థానానికి 20 ఏళ్లు**

**జెడ్పీటీసీగా ప్రారంభమైన ప్రయాణం**

**ముఖ్యమంత్రికి మంత్రుల శుభాకాంక్షలు**

### ప్రజాసేవకు అంకితమంటూ అభినందనలు

**హైదరాబాద్, జులై 4**

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రజాప్రతినిధిగా తన రాజకీయ జీవితంలో రెండు దశాబ్దాల మైలురాయిని చేరుకున్నారు. మిడ్జిల్ మండలం జెడ్పీటీసీగా ప్రారంభమైన ఆయన ప్రజాసేవా ప్రస్థానం నేటికి 20 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. గ్రామీణ స్థాయి ప్రజాప్రతినిధిగా ప్రారంభమైన ఈ ప్రయాణం రాష్ట్ర అత్యున్నత ప్రజాప్రతినిధి పదవైన ముఖ్యమంత్రి స్థాయికి చేరుకోవడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రివర్గ సభ్యులు, (మిగతా 2వ పేజీలో)



## సంజీవని ఆస్పత్రి సేవలు అమోఘం

**'గిఫ్ట్ ఆఫ్ లైఫ్' కార్యక్రమంలో పాల్గొనడం**


**విజయ్ దేవరకొండతో కలిసి హాజరు**

**ఏడాది జీతాన్ని ట్రస్ట్‌కు విరాళం**

**సిద్దిపేట, జులై 4**

సిద్దిపేట జిల్లా కొండపాకలోని శ్రీ సత్యసాయి సంజీవని ఆస్పత్రిలో నిర్వహించిన 'గిఫ్ట్ ఆఫ్ లైఫ్' కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సినీ నటుడు విజయ్ దేవరకొండతో కలిసి పాల్గొన్నారు. (మిగతా 2వ పేజీలో)

### విశ్వవాణి



ప్రతి రోజు ఆలస్యంగా నిద్రపోయే వాళ్లకు బ్యాడ్ న్యూస్. రాత్రిళ్లు నిద్రపోకుండా మెలకువతో ఉండి, తెల్లవారుజామున నిద్రపోయేవారు తీవ్ర ఒత్తిడికి గురవుతారట. వారిలో ఆత్రుత కూడా ఎక్కువగా ఉంటుందని, ఆహారం కూడా ఎక్కువగా తీసుకోలేరని, దాంతో అనారోగ్య సమస్యలు ఎక్కువవుతాయని తాజా అధ్యయనం స్పష్టం చేసింది.

## కవితకు ఈసీ షాక్..!

**పార్టీ పేరుపై అభ్యంతరాలు.. కొత్త పేర్లు కోరిన ఈసీ**



**హైదరాబాద్, జులై 4**

సొంత రాజకీయ పార్టీతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త ప్రస్థానం ప్రారంభించాలనుకుంటున్న కల్వకుంట్ల కవితకు కేంద్ర ఎన్నికల సంఘం కీలక షాక్ ఇచ్చింది. 'తెలంగాణ రక్షణ సేన' పేరుతో పార్టీ నమోదు కోసం దాఖలు చేసిన దరఖాస్తుపై వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చినట్లు వెల్లడించిన ఎన్నికల సంఘం, అదే పేరుతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. పార్టీ నమోదు ముందుకు సాగాలంటే 15 రోజుల్లోగా మూడు ప్రత్యామ్నాయ పేర్లను సమర్పించాలని ఆదేశించింది. కేంద్ర ఎన్నికల సంఘం కవితకు పంపిన అధికారిక లేఖలో నిర్ణీత గడువులోగా కొత్త పేర్లను సూచించాలని పేర్కొంది. లేదంటే (మిగతా 2వ పేజీలో)



## జెడ్పీటీసీ నుంచి సీఎంగా..

### ఉరుకొండపేటలో భావోద్వేగ క్షణాలు

- రూ.10 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- 20 ఏళ్ల జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న సీఎం
- ఆత్మీయులతో ప్రత్యేక సమావేశం

**నాగర్‌కర్నూల్, జులై 4**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాగర్‌కర్నూల్ జిల్లా ఉరుకొండపేటలోని శ్రీశ్రీశ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు (మిగతా 2వ పేజీలో)

ఈవార్తలు

ఆదివారం 5-7-2026

## రాశి ఫలాలు

.....5.7.2026

మేషం : అచంచలమైన ఆత్మవిశ్వాసంతో మీరు ప్రారంభించే ప్రతి పనిలోనూ విజయం మీదే. మీ నాయకత్వ లక్షణాలను నమ్ముకుని ధైర్యంగా ముందుకు సాగండి. శ్రీలక్ష్మీదేవిని స్మరించడం వల్ల మీలో సానుకూల శక్తి పెరిగి కార్యసిద్ధి కలుగుతుంది.

వృషభం : మీ బాధ్యతలను సకాలంలో పూర్తి చేయడమే ఈ రోజు మీ విజయానికి పునాది. సంశయాలను వీడి, మీ అంతరాత్మను నమ్మి ధైర్యంగా నిర్ణయాలు తీసుకోండి. సూర్య భగవానుడిని ధ్యానించడం వల్ల మనోబలం చేకూరి ఆటంకాలు తొలగుతాయి.

మిథునం : పదునైన తెలివితేటలతో ఏ సమస్యనైనా మీరు సులభంగా పరిష్కరించగలరు. మీ లక్ష్యాలపై దృష్టి కేంద్రీకరిస్తే అద్భుతమైన ఆర్థిక పురోగతి లభిస్తుంది. ఇష్టదైవాన్ని ఆరాధించడం వల్ల మనస్సు ప్రశాంతంగా ఉండి సరైన నిర్ణయాలు తీసుకుంటారు.

కర్కాటకం : పట్టుదలతో పనులు పూర్తి చేయడమే మీ విజయ రహస్యం, ఏ విషయంలోనూ వెనకడుగు వేయకండి. మీ సమయస్ఫూర్తి ఆర్థిక లాభాలను చేకూర్చి, ఆటంకాలను సునాయాసంగా దాటేలా చేస్తుంది. నవగ్రహ శ్లోకాలను పఠించడం వల్ల అంతర్గత శాంతి లభించి కార్యసిద్ధి కలుగుతుంది.

సింహం : మీ సహజ నాయకత్వ లక్షణాలు నేడు మీకు గొప్ప గుర్తింపును తెచ్చిపెడతాయి. నమ్మకంతో మీరు వేసే ప్రతి అడుగూ కొత్త శిఖరాలను అధిరోహించేలా చేస్తుంది. నవగ్రహ స్తోత్రాలను పఠించడం వల్ల మీలో మనోధైర్యం పెరిగి, సత్యనిష్ఠతో మీరు విజేతలుగా నిలుస్తారు.

కన్య : అపారమైన ఆశావహ దృక్పథంతో మీరు ప్రారంభించిన పనులు అద్భుతాలను సృష్టిస్తాయి. మీలోని సృజనాత్మకతతో అసాధ్యాలను కూడా సులభంగా సుసాధ్యం చేసుకుంటారు. శ్రీలక్ష్మీ అష్టకం పఠించడం వల్ల మీకు శుభం కలిగి, మీ కృషికి తగిన ఫలితాలు అందుతాయి.

తుల : మానసిక దృఢత్వంతో ఎలాంటి పరిస్థితులనైనా జయించే ధీశాలిగా తయారవుతారు. మీకున్న అపారమైన అనుభవంతో ఇతరులపై ఆధారపడకుండా మీ ప్రతిభను నిరూపించుకోండి. నవగ్రహ ధ్యానం చేయడం వల్ల మనస్సు స్థిరపడి, ధర్మబద్ధమైన మార్గంలో విజయాలు సాధిస్తారు..

వృశ్చికం : స్థిరమైన ఆలోచనలతో మీరు తీసుకునే నిర్ణయాలు గొప్ప విజయాలకు నాంది పలుకుతాయి. ఎదురయ్యే సవాళ్లను మీ బుద్ధిబలంతో చిత్తు చేసి లక్ష్యాన్ని చేరుకోండి. ఈశ్వర ఆరాధనతో పాటు నవగ్రహ శ్లోకాలు పఠించడం వల్ల మీ మనోబలం రెట్టింపవుతుంది.

ధనుస్సు : స్పష్టమైన లక్ష్యంతో మీరు చేసే ప్రయత్నాలు తప్పక ఫలిస్తాయి. ఎలాంటి ఒత్తిడికీ తలొగ్గకండి. మీ అంకితభావానికి ఆర్థికంగా ప్రతిఫలం కచ్చితంగా లభిస్తుంది. నిరంతర సాధనతో ముందడుగు వేయండి. శ్రీవేంకటేశ్వర స్వామి స్మరణ వల్ల ఆపదలు తొలగిపోతాయి. స్వామి మీకు కొండంత అండగా నిలుస్తారు.

మకరం : దృఢ నిశ్చయంతో మీరు చేసే పనులు మిమ్మల్ని విజయ తీరాలకు చేరుస్తాయి. సరైన ప్రణాళికతో కష్టపడితే మిమ్మల్ని ఆపడం ఎవరి తరమూ కాదు. శ్రీలక్ష్మీదేవిని ధ్యానించడం ద్వారా మీలో సానుకూలత పెరిగి, మీ భవిష్యత్తుకు బంగారు బాటలు పడతాయి.

కుంభం : సాహసోపేతమైన నిర్ణయాలు, ధైర్యంతో మీరు నేడు అద్భుతమైన ఫలితాలను అందుకుంటారు. ధర్మబద్ధంగా మీరు వేసే ప్రతీ అడుగూ విజయానికి నాంది పలుకుతుంది. నవగ్రహ శ్లోకాలు పఠించడం వల్ల కార్యక్రమాల్లోని విఘ్నాలు తొలగి, స్థిరమైన మనస్సుతో మీరు విజేతలుగా నిలుస్తారు.

మీనం : దృఢ నిశ్చయంతో మీరు ప్రారంభించే పనులకు తిరుగుండదు. ఏకాగ్రతతో ముందుకు సాగండి. మీ అంకితభావం, పడే శ్రమ మీకు అపూర్వమైన విజయాలను బహుమతిగా అందిస్తాయి. మేధాసూక్తం వినడం వల్ల బుద్ధిబలం పెరిగి, ఆపదల నుంచి బయటపడతారు.

# సంజీవని ఆస్పత్రి సేవలు అమోఘం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా చిన్నారులకు ఉచిత గుండె శస్త్రచికిత్సలు నిర్వహిస్తూ వేలాది కుటుంబాల్లో ఆశ వెలిగిస్తున్న ఆస్పత్రి సేవలను ఆయన ప్రశంసించారు. ఈ ఆస్పత్రి ట్రస్ట్‌కు తన ఏడాది జీతాన్ని విరాళంగా అందజేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం వేలాది మంది చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు చేసి కొత్త జీవితాన్ని అందించడం సాధారణ విషయం కాదన్నారు. చిన్నారులకు పునర్జ న్మ ప్రసాదిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది, సేవా సంస్థ ప్రతినిధుల కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ప్రేమ, అంకితభావ ం,సహనంతో సేవలందిస్తున్న ప్రతి ఒక్కరికీ నమస్కారాలు తెలిపా రు.ఆస్పత్రి వ్యవస్థాపకుడు శ్రీనివాస్ సేవలను కొనియాడిన హరీశ్ రావు,ఆయనను "కనిపించే దేవుడు"గా అభివర్ణించారు.

దేవాల యంలో కనిపించని దేవుడిని ప్రార్థిస్తామని, కానీ ఈ ఆస్పత్రి ద్వారా వేలాది చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న శ్రీని వాస్ నిజమైన సేవామూర్తి అని అన్నారు.తన సంపాదనతోనే సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నా రని కొనియాడారు.ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాల నుంచి వచ్చిన చిన్నారులు ఇక్కడ వైద్యం పొంది ఆరోగ్యం గా తిరిగి వెళ్తుండటం ఆనందంగా ఉందన్నారు. కార్పొరేట్ ఆస్ప త్రులకు ఏమాత్రం తీసిపోని స్థాయిలో పరిశుభ్రత, వైద్య సేవలు, రోగుల పట్ల ఆప్యాయత ఈ ఆస్పత్రిలో కనిపిస్తున్నాయని పేర్కొన్నా రు. తల్లిదండ్రుల కళ్లలో కనిపిస్తున్న ఆనందమే ఈ సేవలకు నిదర్శనమన్నారు.సమాజానికి సేవ చేయడానికి పెద్ద సంపద అవసరం లేదని, ప్రతి ఒక్కరూ తమకు చేతనైనంత మేర ఇతరుల కు సహాయం చేయాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. మనిషి జీవితంలో పదవులు, సంపద కంటే చేసిన సేవే శాశ్వతంగా నిలిచిపోతుందని అన్నారు. తాను ప్రతి సంవత్సరం ఈ ఆస్పత్రిని సందర్శిస్తానని, భవిష్యత్తులో కూడా ఈ సేవా కార్యక్రమాలకు అండగా ఉంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సినీ హీరో విజయ్ దేవరకొండ, ఆస్పత్రి ప్రతినిధులు, వైద్యులు, నర్సులు, సిబ్బంది, చిన్నారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని వక్తలు పిలుపునిచ్చారు.

## ట్రంప్ కొత్త ప్రతిపాదన..!

(మొదటి పేజీ తరువాయి)

సభ్యులను వైట్‌హౌస్‌కు ఆహ్వానించి అందరూ కలిసి ఫుట్‌బాల్ మ్యాచ్ వీక్షిస్తే బాగుంటుందని ఆయన ఆసక్తికర ప్రతిపాదన చేశారు.అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా విడుదలైన ఒక పాడ్‌కాస్ట్‌లో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'స్టోరీటైమ్ విత్ ద సెకండ్ లేడీ' పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ట్రంప్, వైట్‌హౌస్ హిస్టారికల్ అసోసియేషన్ ప్రచురించిన 'ప్రెసిడెంట్స్ ప్లే!' పుస్తకాన్ని చదివి వినిపించారు. గత అమెరికా అధ్యక్షులు తమ విశ్రాంతి సమయాన్ని ఎలా గడిపేవారో వివరిస్తున్న ఈ పుస్తకంలోని అంశాలపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఒక మాజీ అధ్యక్షుడు వైట్‌హౌస్‌లో సూపర్ బౌల్ మ్యాచ్ వీక్షణ కార్యక్రమాన్ని నిర్వహించిన విషయం తనకు కొత్త ఆలోచన కలిగించిందని చెప్పారు."బరాక్ హుస్సేన్ ఒబామా, జో బైడెన్, బుష్ కుటుంబ సభ్యులను వైట్‌హౌస్‌కు ఆహ్వానించి అందరం కలిసి ఫుట్‌బాల్ మ్యాచ్ చూస్తే అది అద్భుతమైన కథనంగా మారుతుంది. మీడియా కూడా దానిపై విస్తృతంగా చర్చిస్తుంది" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. దీనిపై పాడ్‌కాస్ట్ నిర్వాహకురాలు ఉషా వాన్స్ స్పందిస్తూ.. "మాజీ అధ్యక్షుల పునర్మిళనం చాలా సరదాగా ఉ ంటుంది" అని అన్నారు. బహిరంగ సభల్లో ఒబామా, బైడెన్‌లపై తరచూ విమర్శలు చేసే ట్రంప్ నుంచి ఇలాంటి ప్రతిపాదన రావడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ, మాజీ అధ్యక్షులందరూ ఒకే వేదికపై కలుసుకోవడం అమెరికా రాజకీయాల్లో ప్రత్యేక ఘట్టంగా నిలుస్తుందని పలువురు విశ్లేషిస్తున్నారు.పాడ్‌కాస్ట్ సందర్భంగా ట్రంప్ మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్‌పై కూడా ప్రశంసలు కురిపించారు. వైట్‌హౌస్‌లో రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేసిన క్లింటన్‌ను ప్రశంసిస్తూ, తనకు ఆయనంటే ఇప్పటికీ ఇష్టమేనని పేర్కొన్నారు. అయితే తాను మాత్రం వైట్‌హౌస్‌లో రన్నింగ్ ట్రాక్ నిర్మించే ఆలోచన చేయనని సరదాగా వ్యాఖ్యానించారు. అమెరికా మాజీ అధ్యక్షుడు విలియం హోవార్డ్ టాఫ్ట్ గురించి కూడా ట్రంప్ హాస్యభరిత వ్యాఖ్యలు చేశారు. ఆయన అమెరికా చరిత్రలో అత్యంత బరువైన అధ్యక్షుడిగా గుర్తింపు పొందారని గుర్తుచేస్తూ, ఆ రికార్డును తాను బద్దలు కొట్టకూడదని నవ్వుతూ వ్యాఖ్యానించారు. ప్రజల కోసం పనిచేయడం తనకు గౌరవంగా భావిస్తానని, వైట్‌హౌస్‌లో గడిపే ప్రతి క్షణాన్ని దేశ సేవకే అంకితం చేస్తానని ట్రంప్ పేర్కొన్నారు.

## జోధ్‌పూర్ విమానాశ్రయానికి నూతన టెర్మినల్

(మొదటి పేజీ తరువాయి)

అత్యాధునిక సాంకేతిక సదుపాయాలతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా టెర్మినల్‌ను తీర్చిదిద్దారు.ఈ టెర్మినల్ ద్వారా ఏటా 20 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యం ఏర్పడింది. ప్రస్తుతం ఉన్న ప్రయాణికుల రద్దీతో పాటు భవిష్యత్తులో పెరిగే డిమాం డ్‌ను దృష్టిలో ఉంచుకుని విస్తృత సామర్థ్యంతో దీనిని నిర్మి ంచారు.విమానాశ్రయ సేవల నాణ్యత మరింత మెరుగుప డుతుందని అధికారులు తెలిపారు. విమానాశ్రయంలో ఒకేసారి 12 విమానాలు నిలిపివేసేలా ప్రత్యేక పార్కింగ్ బేలు ఏర్పాటు చేశారు. దీంతో విమానాల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. దేశీయ విమానాలతో పాటు భవిష్యత్తులో అంతర్జాతీయ సేవల విస్తరణకు కూడా ఈ మౌలిక వసతులు దోహదపడనున్నాయి. పర్యావరణ హిత సాంకేతికతతో ఈ టెర్మినల్‌ను నిర్మించారు. ఇంధన పొదుపు, సహజ కాంతి వినియోగం, పర్యావరణ పరిరక్ష ణకు అనుగుణంగా రూపకల్పన చేయడంతో పాటు భవి ష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక నమూనా లో అభివృద్ధి చేశారు.ఈ నూతన టెర్మినల్ అందుబాటు లోకి రావడం ద్వారా మార్వార్ ప్రాంతానికి మెరుగైన రవాణా అనుసంధానం లభించనుంది. పర్యాటకం, వాణిజ్యం, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రాజస్థాన్ ఆర్థికాభివృద్ధికి ఇది కీలకంగా దోహదపడుతుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

# ప్రజాసేవలో రెండు దశాబ్దాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిసి అభినందనలు తెలియజేశారు.ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, ధనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి ముఖ్యమంత్రిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ప్రజాసేవలో 20 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో కొద్దిసేపు వారు రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కూడా చర్చించినట్లు తెలిసింది.రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానం మిడ్జిల్ మండలం జెడ్పీటీసీగా ప్రారంభమైంది. అనంతరం శాసనసభ్యుడిగా,పార్లమెంట్ సభ్యుడిగా ప్రజలకు సేవలందించారు.రాష్ట్ర రాజకీయాల్లో కీలక నాయకుడిగా ఎదిగి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు.ఆ తర్వాత జరిగిన శాసనసభ ఎన్నికల్లో పార్టీని విజయపథంలో నడిపించి తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కొనసాగిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వడమే తన రాజకీయ జీవితానికి మూల సూత్రమని ఆయన పలుమార్లు పేర్కొన్నారు.ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రైతు సంక్షేమం, మహిళల అభ్యున్నతి, యువతకు ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధి, విద్య, వైద్యం,మౌలిక సదుపాయాల విస్తరణ వంటి రంగాల్లో ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోంది.తెలంగాణ అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న నాయకుడిగా రేవంత్ రెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందారని వారు అభినందించారు. రాజకీయ జీవితంలో రెండు దశాబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో కూడా పెద్ద ఎత్తున శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. జెడ్పీటీసీ స్థాయి నుంచి ముఖ్యమంత్రి పదవి వరకు ఎదిగిన ఆయన ప్రయాణాన్ని ప్రస్తావిస్తూ పలువురు అభినందన సందేశాలు విడుదల చేశారు. గ్రామీణ స్థాయి ప్రజాప్రతినిధిగా ప్రారంభమైన రాజకీయ ప్రస్థానం రాష్ట్ర ముఖ్యమంత్రి పదవికి చేరుకోవడం ఎంతో మంది యువ నాయకులకు స్ఫూర్తిదాయకమని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా మరింత అంకితభావంతో పనిచేయాలని మంత్రులు, ప్రజాప్రతినిధులు ఆకాంక్షించారు. ప్రజాసేవలో మరో ఎన్నో మైలురాళ్లు అధిగమించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

## అల్లూరి ఆశయాలే నిజమైన నివాళి

(మొదటి పేజీ తరువాయి)

ట్యాంక్‌బండ్‌లోని ఆయన విగ్రహానికి మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కేవలం 27 ఏళ్ల వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం, గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం అల్లూరి సీతారామరాజు చేసిన త్యాగం చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. స్వేచ్ఛ కోసం ఆయన సాగించిన పోరాటం భారత స్వాతంత్ర్య ఉద్యమానికి విశేష స్ఫూర్తినిచ్చిందని కొనియాడారు.

"ప్రజల కోసం, ప్రజల ద్వారా, ప్రజల కోసమే" అనే భావజాలంతో అల్లూరి తన జీవితాన్ని అంకితం చేశారని భట్టి పేర్కొన్నారు. ఆయన చూపిన ధైర్యం, త్యాగం, దేశభక్తి నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. అల్లూరి కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాదని, స్వేచ్ఛను ప్రేమించే ప్రతి భారతీయుడి గుండెల్లో చిరస్థాయిగా నిలిచే మహోన్నత శక్తి అని అభివర్ణించారు. నేటి సమాజంలో ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నించే ధైర్యం ప్రతి ఒక్కరిలో ఉండాలని, బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేయడం ద్వారా అల్లూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.

# జెడ్పీటీసీ నుంచి సీఎంగా..

(మొదటి పేజీ తరువాయి)


నిర్వహించారు.ఈ సందర్భంగా రూ.10 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి రాకతో ఉరుకొండపేట గ్రామంలో సందడి నెలకొంది. రాజకీయ జీవితంలో జెడ్పీటీసీగా ఎన్నికైన 20 ఏళ్ల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉరుకొండపేటలో అడుగుపెట్టిన ముఖ్యమంత్రికి గ్రామస్థులు, ఆనాటి సహచరులు, పెద్దలు ఘన స్వాగతం పలికారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ముఖ్యమంత్రి తనతో కలిసి పనిచేసిన పాత సహచరులను ఆప్యాయంగా పలకరించారు.ఒక్కొక్కరితో కరచాలనం చేస్తూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రెండు దశాబ్దాల క్రితం జరిగిన రాజకీయ ప్రయాణానికి సంబంధించిన అనుభవాలను గుర్తు చేసుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సహచరులు 20 ఏళ్ల క్రితం తీసుకున్న ఫొటోలను చూపిస్తూ అప్పటి సంఘటనలను ముఖ్యమంత్రికి గుర్తు చేశారు.గ్రామ ప్రజల ప్రేమాభిమానాలు ఎప్పటికీ మరువలేనివని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదం, సహచరుల సహకారంతోనే తన రాజకీయ ప్రయాణం ఈ స్థాయికి చేరుకుందని అన్నారు.ఆలయ అభివృద్ధి పనులు పూర్తయితే భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఆలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎంపీలు వేమ్ నరేందర్ రెడ్డి, మల్లు రవి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కవితకు ఈసీ షాక్..!

(మొదటి పేజీ తరువాయి)

ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా పార్టీ రిజిస్ట్రేషన్ దరఖాస్తును మూసివేస్తామని హెచ్చరించింది. ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది.ఈ నిర్ణయంపై కల్వకుంట్ల కవిత తీవ్రంగా స్పందించారు. ఎన్నికల సంఘం పేర్కొన్న అభ్యంతరాలపై ఇప్పటికే తమవైపు నుంచి పూర్తి వివరణ ఇచ్చామని తెలిపారు. ప్రత్యామ్నాయ పేర్లు పంపే ఉద్దేశం తమకు లేదని, 'తెలంగాణ రక్షణ సేన' పేరుతోనే పార్టీని నమోదు చేయించుకునేందుకు ప్రయత్నిస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే ఈ అంశంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయపోరాటం కూడా చేస్తామని ప్రకటించారు.కొత్త పార్టీ ఏర్పాటుకు సంబంధించి ఈ ఏడాది ఫిబ్రవరిలో కవిత ఐదు పేర్లను కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదించారు. 'తెలంగాణ ప్రజా జాగృతి', 'తెలంగాణ జాగృతి', 'తెలంగాణ రక్షణ సేన', 'తెలంగాణ రాష్ట్ర జాగృతి', 'తెలంగాణ ప్రజా శక్తి' పేర్లను పరిశీలన కోసం పంపించారు. అనంతరం ఏప్రిల్ 25న నిర్వహించిన పార్టీ ఆవిర్భావ సభలో 'తెలంగాణ రాష్ట్ర సేన' పేరును ప్రకటించి పార్టీ జెండాను కూడా ఆవిష్కరించారు. అయితే మూడు రోజుల వ్యవధిలోనే పార్టీ పేరును 'తెలంగాణ రక్షణ సేన'గా మార్చుతూ ఎన్నికల సంఘానికి సమాచారం అందించారు. అనంతరం ఈ పేరుపై ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించే ప్రక్రియను ఎన్నికల సంఘం చేపట్టింది. 'రాష్ట్ర సేన' నుంచి 'రక్షణ సేన'గా పేరు మార్చడంపై అప్పట్లోనే రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ జరిగింది.ప్రస్తుతం 'తెలంగాణ రక్షణ సేన' పేరుతోనే కవిత రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కార్యకలాపాలు నిర్వహిస్తూ కేడర్‌ను సమీకరిస్తున్నారు. ఇలాంటి సమయంలో పార్టీ పేరుపై వెయ్యికి పైగా అభ్యంతరాలు రావడం, ప్రత్యామ్నాయ పేర్లు సూచించాలని ఎన్నికల సంఘం ఆదేశించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పుడు అదే పేరును కొనసాగించేందుకు కవిత న్యాయపోరాటం చేస్తారా, లేక కొత్త పేరును ఎంచుకుంటారా అన్నది ఆసక్తికరంగా మారింది.

వర్షాకాలం సీజనల్ వ్యాధులు పెరిగే అవకాశాల నేపథ్యంలో ప్రజలకు సకాలంలో అత్యవసర వైద్యసేవలు అందించేందుకు 108 అంబులెన్స్ సేవలు పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా కాలానుగుణ వ్యాధులతో పాటు పాములు, తేళ్లు, ఇతర విష కీటకాల కాట్లు, విద్యుత్ ప్రమాదాలు, నీటిలో మునిగే ఘటనలు పెరిగే అవకాశం అవకాశం ఉంది. ఈ క్రమంలో గ్రామీణ ప్రాంతాలు, వ్యవసాయ పొలాలు, ఏజెన్సీ ప్రాంతాలు, అడవులకు సమీప ప్రాంతాల్లో నివసించే ప్రజలకు అత్యవసర వైద్య సేవలు వేగంగా అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు.






# సీజనల్ వ్యాధులపై యుద్ధానికి 108 సర్వ సన్నద్ధం

**వేగవంతమైన వైద్యసేవలతో ప్రజారోగ్యానికి అండగా 108.. ప్రతి అంబులెన్స్‌లో అత్యవసర మందులు, వైద్య పరికరాలు సిద్ధం**

అమరావతి, జూలై 4 : వర్షాల కారణంగా రహదారులు దెబ్బతినడం, నీటిమునక ప్రాంతాలు ఏర్పడటం వంటి పరిస్థితుల్లోనూ బాధితులకు వీలైనంత త్వరగా వైద్య సహాయం అందించేందుకు 108 బృందాలు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నాయి.గోల్డెన్ అవర్ లో స్పందనవర్షాకాల అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని 108 అంబులెన్స్‌లలో అవసరమైన అత్యవసర మందులు, ఆక్సిజన్, ప్రాథమిక ప్రాణరక్షక పరికరాలు, ఇతర వైద్య సామగ్రిని అందుబాటులో ఉంచారు. అత్యవసర పరిస్థితుల్లో సమయానికి స్పందించేలా ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు (ఇఓబి), పైలట్లకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు. గోల్డెన్ అవర్‌లో బాధితులకు ప్రాథమిక చికిత్స అందించి సమీప ఆసుపత్రికి సురక్షితంగా తరలించేందుకు అన్ని విధాలా సన్నద్ధంగా ఉన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చోట అదనపు సమన్వయంతో సేవలు అందిస్తున్నారు.ప్రాణాధారంగా 108గత ఏడాది (జూలై 2025?జూన్ 2026) కాలంలో 108 సేవలు వర్షాకాలంలో ఎక్కువగా కనిపించే అత్యవసర పరిస్థితుల్లో వేలాది మందికి ప్రాణాధారంగా నిలిచాయి. ఈ కాలంలో జ్వరానికి సంబంధించిన 28,933 అత్యవసర కేసులు, జంతువులు/విష కీటకాల కాట్లకు సంబంధించిన 14,353 కేసులు, విద్యుత్ షాక్‌కు సంబంధించిన 2,194 కేసులు, నీటిలో మునిగిన 718 కేసులు, పిడుగుపాటుకు సంబంధించిన 96 కేసులకు సకాలంలో స్పందించి అత్యవసర వైద్య సేవలు అందించాయి. ఈ గణాంకాలు వర్షాకాలంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో సమయానికి అందే వైద్య సహాయమే ప్రాణాలను కాపాడగలదని ఈ ఘటనలు మరోసారి నిరూపించాయి.వర్షాకాలంలో ముఖ్యంగా పాములు, తేళ్లు, ఇతర విష కీటకాలు నివాస ప్రాంతాల్లోకి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అలాగే భారీ వర్షాల సమయంలో నీటిలో మునిగే ప్రమాదాలు, విద్యుత్ తీగలు తెగిపడటం వల్ల విద్యుత్ షాక్ ఘటనలు, వైరల్ జ్వరాలు వంటి అత్యవసర పరిస్థితులు కూడా పెరుగుతుంటాయి. ఇలాంటి సందర్భాల్లో ప్రజలు భయాందోళనలకు గురికాకుండా వెంటనే 108 సేవలను ఆశ్రయించాలని అధికారులు సూచిస్తున్నారు. స్థానిక చికిత్సలపై ఆధారపడకుండా వైద్య నిపుణుల సహాయం పొందడం వల్ల ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశాలు మెరుగవుతాయి.( ప్రజారోగ్యమే లక్ష్యంఈ సందర్భంగా భవ్య హెల్త్ కేర్ మీడియా కోఆర్డినేటర్ మాట్లాడుతూ... ప్రజల ప్రాణాలను కాపాడడమే 108 సేవల ప్రధాన లక్ష్యమని తెలిపారు. వర్షాకాలంలో ఎదురయ్యే ప్రతి అత్యవసర పరిస్థితికి సిద్ధంగా ఉండేలా అంబులెన్స్‌లు, సిబ్బంది, వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచామని చెప్పారు. పాము లేదా విష కీటకం కాటు, విద్యుత్ షాక్, నీటిలో మునిగే ప్రమాదం, తీవ్ర జ్వరం లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా వెంటనే 108కు కాల్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల అప్రమత్తతతో పాటు సమయానికి అందే అత్యవసర వైద్య సేవలే అనేక ప్రాణాలను కాపాడగలవని పేర్కొన్నారు. వర్షాకాలంలో ప్రజలకు 108 సూచనలువానాకాలంలో ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, నిల్వ నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలిదోమల నివారణ చర్యలు చేపట్టాలని, శుద్ధి చేసిన తాగునీరు మాత్రమే వినియోగించాలిఅనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని లేదా వైద్యులను సంప్రదించాలిపాము లేదా విష కీటకం కాటు పడితే స్థానిక చికిత్సలకు వెళ్లకుండా వెంటనే 108కు కాల్ చేయాలినీటిలో మునిగిన వ్యక్తికి వీలైనంత త్వరగా అత్యవసర వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలితెగిపడిన విద్యుత్ తీగలు లేదా నీటిలో ఉన్న విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండాలిఅధిక జ్వరం, స్పృహ కోల్పోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్య సహాయం పొందాలిభారీ వర్షాలు, వరదల సమయంలో అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలి.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.



## రాష్ట్రానికి ఆదర్శంగా నలగంపల్లి నెట్‌జీరో విధానం

**కుప్పం అంతటా అమలుకు సీఎం ఆదేశం**

**నెట్‌జీరో విధానాన్ని అమలు చేస్తోన్న ఇళ్లను సీఎం పరిశీలన**

కుప్పం, జూలై 4 : నెట్‌జీరో విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న నలగంపల్లి గ్రామాన్ని రాష్ట్రానికి ఆదర్శంగా నిలబెట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. కుప్పం పర్యటన రెండో రోజు శనివారం నలగంపల్లిలోని నెట్ జీరో విధానాన్ని అమలు చేస్తోన్న ఇళ్లను సందర్శించిన ముఖ్యమంత్రి....సోలార్ రూఫ్‌టాప్ సోలార్, ఇండక్షన్ కుక్‌టాప్‌లు, వర్షపు నీటి సంరక్షణ, కిచెన్ కంపోస్టింగ్, టెర్రస్ గార్డెనింగ్ వంటి విధానాలను పరిశీలించారు. నలగంపల్లి నమూనాను కేస్ స్టడీగా తీసుకుని కుప్పం వ్యాప్తంగా నెట్‌జీరో విధానాన్ని విస్తరించాలని అధికారులను ఆదేశించారు.సర్క్యులర్ ఎకానమిని గ్రామస్థాయిలో అమలు గ్రామంలోని ఓ ఇంటిని సందర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు... సోలార్ ప్యానెళ్ల సంఖ్య, విద్యుత్ ఉత్పత్తి, ఇంటి అవసరాలకు సరిపోతుందా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. సోలార్ విద్యుత్‌తో ఇండక్షన్ స్టవ్‌లను ఉపయోగిస్తూ నెలకు సుమారు రూ.400 వరకు ఆదా చేస్తున్నామని లబ్ధిదారులు వివరించారు. వర్షపు నీటి సంరక్షణ, కిచెన్ కంపోస్ట్ ద్వారా వ్యర్థాల నిర్వహణ, కిచెన్ గార్డెన్, టెర్రస్ గార్డెన్ నిర్వహణను కూడా సీఎం పరిశీలించారు. నెట్‌జీరో విధానంలో భాగంగా ఈవీ వాహనాల వినియోగాన్ని కూడా చేర్చాలని ముఖ్యమంత్రి సూచించారు. సర్క్యులర్ ఎకానమిని గ్రామస్థాయిలో అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నలగంపల్లి అనుసరిస్తున్న విధానం రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.ఇండక్షన్‌తో భద్రత ఇండక్షన్ స్టవ్‌లతో ప్రస్తుతం అన్ని రకాల వంటలు చేసుకునే సాంకేతికత అందుబాటులోకి వచ్చిందని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికే ఇండక్షన్ స్టవ్‌లను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. గ్యాస్ లీకేజీ ప్రమాదాలు తగ్గడంతో పాటు భద్రత పెరుగుతుందని గ్రామస్థులు సీఎంకు వివరించారు. కుప్పంలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థ విస్తరణ ద్వారా 7,489 మంది ఎస్సీ, ఎస్టీలు, 39,215 మంది బీసీలు, 7,381 మంది ఓసీ కుటుంబాలకు ప్రయోజనం చేకూరేలా చర్యలు చేపడుతున్నట్లు సీఎంకు అధికారులు వివరించారు.



## సంజీవనిలో డేటా ఇంటిగ్రేషన్ కీలకం

**కుప్పం ప్రభుత్వ ఆస్పత్రిలో సీటీ స్కాన్, డయాలసిస్ సేవల్ని ప్రారంభించిన సీఎం**

**డ్రగ్స్, గంజాయిపై మరింత కఠినంగా ఉండాలని పోలీసులకు ఆదేశం**

**పంచతత్వ కాన్సెప్టుతో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ పరిశీలించిన సీఎం చంద్రబాబు**

కుప్పం, జూలై 4 (ఆర్ఎన్ఏ ప్రతినిధి): సంజీవని కార్యక్రమంలో డేటా అనుసంధానమే కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్ నుంచి ఆస్పత్రి పరిశుభ్రత వరకు ప్రతీ అంశంపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. కుప్పం నియోజకవర్గ పర్యటన రెండో రోజు కుప్పం ప్రాంతీయ ఆస్పత్రిలో సీటీ స్కాన్, డయాలసిస్ కేంద్రాలను ప్రారంభించి సేవలను పరిశీలించారు. సంజీవని ప్రాజెక్టు అమలు, వైద్యారోగ్య రంగంలోని ఆవిష్కరణలు, డ్రగ్స్ నివారణ చర్యలపై అధికారులతో మాట్లాడారు. డిజిటలైజేషన్ తో పాటు డేటా ఇంటిగ్రేషన్ అవసరంకుప్పం ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సీటీ స్కాన్, డయాలసిస్ సెంటర్లను ముఖ్యమంత్రి ప్రారంభించారు. సీటీ స్కాన్ ద్వారా రోజుకు ఎంత మందికి సేవలు అందించగలరని సీఎం ప్రశ్నించారు. రోజుకు 30?40 మందికి పరీక్షలు చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఆస్పత్రిని పరిశీలన సందర్భంగా ఆవరణలో కొంత మేర చెత్త కనిపించడంపై ప్రశ్నించిన ముఖ్యమంత్రి, వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంజీవని కార్యక్రమంలో డేటా అనుసంధానమే ముఖ్యమని పేర్కొన్నారు. హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేయడంతోపాటు ప్రతి అంశంలోనూ డేటా ఇంటిగ్రేషన్ చేయాలని సూచించారు. డయాలసిస్ వార్డును సందర్శించిన సందర్భంగా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా కుప్పం ఏరియా ఆస్పత్రికి డయాలసిస్ నిమిత్తం వస్తున్నారని అధికారులు వివరించారు. సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రజలు సంతృప్తి చెందాలని, కుప్పంలో ప్రజలకు ఏ మేరకు మేలు కలిగిందో వివరాలను సిద్ధం చేయాలని ఆదేశించారు.గంజాయి నియంత్రణపై కఠిన చర్యలుపంచతత్వ కాన్సెప్టుతో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించిన సీఎం చంద్రబాబు అక్కడ మొక్క నాటారు. వైద్యారోగ్య రంగంలో వివిధ ఆవిష్కరణలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో వైద్యులకు తక్షణ సమాచారం అందించేలా ఓ పరికరం రూపొందించిన విద్యార్థిని సీఎం అభినందించారు. గంజాయి, డ్రగ్స్ బారిన పడ్డవారికి మెడిటేషన్ ద్వారా ఆరోగ్యం మెరుగయ్యేందుకు సహకారం అందిస్తున్నట్టు బ్రహ్మకుమారీలు వివరించారు. డ్రగ్స్, గంజాయి వంటి వాటిని నివారించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కుప్పం నగరంలో ఏర్పాటు చేసిన స్వర్ణ కుప్పం?స్వచ్ఛ కుప్పం స్వాగత ఆర్చ్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖమంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.







## రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలి

**-ఏఐటీయుసి డిమాండ్**

ఏలూరు, జూలై 4 (ఆర్ఎన్ఏ ప్రతినిధి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 2024 ఎన్నికల సందర్భంగా ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ మరియు ఎన్ ఎం ఆర్ లను రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని ఏఐటియుసి ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జులై 7న విజయవాడలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో నగరపాలక సంస్థలలో, పురపాలక సంఘాలలో, నగర పంచాయతీలలో పనిచేస్తున్న ఉద్యోగ, సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జరుగుతున్న ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని శనివారం ఉదయం ఏలూరులో జరిగిన ప్రసార కార్యక్రమంలో బండి వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఏలూరు కోట దిబ్బ ఎస్ ఆర్ వన్ వద్ద ఏఐటీయూసీ అనుబంధ ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్రమాన్ని తెలియజేస్తూ మస్తరు సమయంలో గేట్ మీటింగ్ జరిగింది. మీటింగుకు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏ అప్పలరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయడం లో విఫలం చెందిందని ఆయన తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ,ఎన్ ఎమ్ ఆర్ లను రెగ్యులర్ చేయాలని ఆయన కోరారు. 11వ పిఆర్సి బకాయిలను చెల్లించాలని, రెగ్యులర్ ఉద్యోగ సిబ్బందికి బకాయిపడిన సరెండర్ లీవ్ లను, డి ఏ లను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. 12వ పిఆర్సి కమిటీ వేయాలని, ఐ ఆర్ 30 శాతం ప్రకటించాలని ఆయన కోరారు. యూనియన్ కార్యదర్శి ఏ అప్పలరాజు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, ఎన్.ఎం.ఆర్ లకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, కనీస పెన్షన్ నెలకు పదివేలు చెల్లించాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. జులై ఐదో తేదీన ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ 37వ వ్యవస్థాపక దినోత్సవం ను కోట దిబ్బ ఎస్ ఆర్ వన్ వద్ద ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు అప్పలరాజు తెలిపారు. చలో విజయవాడ ప్రసార కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి నారాయణరావు, ఎస్ఎంవి సుబ్బారావు, ఎస్ గౌరీ శంకర్, పి దుర్గారావు, ఎమ్మెస్ బాజీ, బి కే డి వి ప్రసాద్, కే రామచంద్రరావు, ఎం రంగారావు తదితరులు పాల్గొన్నారు

నేటి ఈవార్తలు

COMMERCIAL RATE CARD

DISPLAY ADVERTISEMENTS
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))

| Position | B&W Rate | Colour Rate |
|---|---|---|
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE:
Price for 5 Lines – Rs.450
(for each extra line – Rs.90)

COLOUR:
Price for 5 Lines – Rs.500
(for each extra line – Rs.100)

Phone: +91 94404 55811 Email: contact@evarthalu.com

# భద్రకాళి ఆలయం వద్ద ఉద్రిక్తత

**బిజెపి నేతలను అడ్డుకున్న పోలీసులు.. కాంగ్రెస్, బిఆర్ఎస్ అపవిత్రం చేశారంటూ ఆరోపణ.. పరస్పర విమర్శలతో స్థానికంగా ఉద్రికత**

వరంగల్,జులై4 : వరంగల్ నగరంలోని ప్రముఖ భద్రకాళీ ఆలయం వద్ద వరుసగా రెండోరోజు శనివారం కూడా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు తడిబట్టలతో ఆలయంలో స్నానాలు చేయడం వల్ల ఆలయం అపవిత్రమైందని ఆరోపిస్తూ, ఆలయ సంప్రోక్షణ నిర్వహించేందుకు బీజేపీ నేతలు, కార్యకర్తలు ఆలయానికి చేరుకున్నారు. అయితే, పరిస్థితులు ఉద్రిక్తంగా మారే అవకాశం ఉందని భావించిన పోలీసులు బీజేపీ నాయకులను ఆలయ ప్రాంగణంలోకి అనుమతించలేదు. దీంతో బీజేపీ కార్యకర్తలు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఆలయం పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆలయ పవిత్రతకు భంగం కలిగిందని పేర్కొంటూ సంప్రోక్షణ నిర్వహించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. మరోవైపు, శాంతిభద్రతల దృష్ట్యా ముందస్తు చర్యగా వారిని అడ్డుకున్నట్లు పోలీసులు తెలిపారు. భద్రకాళీ ఆలయం వద్ద జరిగిన ఈ పరిణామంతో రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ఆలయ పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులో ఉంచేందుకు చర్యలు చేపట్టారు. వరంగల్‌లో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ భూముల వేలం వ్యవహారం రాజకీయ రగడ సృష్టిస్తోంది. ఈ వేలం వ్యవహారంలో అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం భద్రకాళి అమ్మవారి ఆలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. ఆ తర్వాత 'కుడా' ఛైర్మన్ వెంకట్రామిరెడ్డి ఇతర కాంగ్రెస్ నాయకులు తడి దస్తులతో అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అధికార, విపక్ష సవాళ్లతో భద్రకాళి ఆలయంలో ఉద్రిక్తత నెలకొంది. ఆలయాన్ని రాజకీయాలతో అపవిత్రం చేశారని.. సంప్రోక్షణకు భాజపా పిలుపునివ్వడంతో తాజాగా మరోసారి రాజకీయం వేడెక్కింది. 'శుద్ధి' కార్యక్రమం పేరుతో ఆలయం వద్దకు వచ్చిన భాజపా నేతలను పోలీసులు అరెస్ట్ చేయడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట చోటు చేసుకుంది. పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.



# నీలోఫర్‌లో పసికందును వదిలేసిన తల్లిదండ్రులు

హైదరాబాద్,జులై4 : అనారోగ్యంతో బాధపడుతున్న రోజుల పసికందును తల్లిదండ్రులు నిర్దయగా వదిలేసి వెళ్లిపోయారు. ఈ దారుణ ఘటన నగరంలోని నాంపల్లి నీలోఫర్ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. ఒడిశాకు చెందిన దంపతులు తమ ఆరు రోజుల మగ శిశువును ఆస్పత్రిలో చేర్చారు. శిశువు శ్వాసకోస సమస్యతో బాధపడుతున్నాడు. ఏప్రిల్ 25న శిశువును నీలోఫర్‌లో చేర్చిన తల్లిదండ్రులు అక్కడి నుంచి అదృశ్యమయ్యారు. పసికందుకు సంబంధించిన వారు ఎవరూ లేకపోవడంతో ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పసికందును నీలోఫర్ ఆస్పత్రి వైద్యులు ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారు. ఎన్‌బీసీయూలో చికిత్స అందించి.. శిశువును కాపాడారు. ఆసుపత్రి ఆర్ఎంఓ ఫిర్యాదు మేరకు నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పసికందును సంరక్షణ కోసం శిశు విహార్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. శిశువు తల్లిదండ్రులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

# ఊర్కొండపేటలో సిఎం పర్యటన

**పాత మిత్రులతో సరదాగా గడిపిన రేవంత్**

నాగర్ కర్నూల్,జూలై4 : నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండపేటలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. అక్కడి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 20 ఏళ్ల క్రితం మిడ్జిల్ జడ్పీటీసీగా రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం ప్రారంభమైన సంగతి తెలిసిందే. జడ్పీటీసీగా తన విజయానికి సహకరించిన వారిని సీఎం కలిశారు. అనుచరులు, జిల్లా నేతలతో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. తన రాజకీయ అనుచరులను ఆత్మీయంగా పలకరించారు. మిత్రులతో కలిసి ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డితో ఉన్న అనుబంధాన్ని పలువురు గుర్తు చేసుకున్నారు.

కాసేపు సరదాగా గడిపి ముచ్చటించారు. తనకు హరీష్ రావు అన్న అంటే ఎంతో అభిమానమని, ఆయన్ను 'సిద్ధిపేటకా షేర్' అని సంబోధిస్తూ కొనియాడారు. రాజకీయాలకు అతీతంగా, నిస్వార్థంగా పిల్లల గుండె జబ్బుల నివారణకు మరియు సమాజ సంక్షేమం కోసం హరీష్ రావు చేస్తున్న కృషి అభినందనీయమని విజయ్ దేవరకొండ కొనియాడారు. పేద పిల్లల గుండె ఆపరేషన్లకు ఆయన అందిస్తున్న సాయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, ఇలాంటి నాయకులు జనరేషన్‌కు ఒక్కరే ఉంటారని ప్రశంసించారు. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో పాల్గొనడం, హరీష్ రావు చేస్తున్న ప్రజా సేవను ప్రత్యక్షంగా చూడడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని విజయ్ దేవరకొండ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# బ్రిటిష్ వారిని ఎదరించిన మన్యం వీరుడు

**అల్లూరి జయంతి సందర్భంగా పవన్ నివాళి**

అమరావతి,జులై4 : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఘన నివాళులు అర్పించారు. వీర యోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా, ఆ స్వాతంత్య సమరయోధుడికి ప్రగాఢ నివాళులు అర్పిస్తున్నానని తెలిపారు. స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ పాలనను ధైర్యంగా ఎదిరించి, గిరిజన ప్రజల హక్కులు, గౌరవం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ పోస్టు పెట్టారు.స్వాతంత్య పోరాట చరిత్రలో అల్లూరి సీతారామరాజు చిరస్థాయిగా నిలిచిపోయారని పవన్ కల్యాణ్ ప్రశంసించారు. ఆయన పోరాటం కేవలం ఒక ఉద్యమం మాత్రమే కాదని చెప్పారు. ధైర్యం, త్యాగం, దేశభక్తిని ఎన్నటికీ మరిచిపోలేమని అన్నారు. అల్లూరి ఆశయాలే దేశానికి మార్గదర్శకమని వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్యాన్ని కాపాడాలంటే బాధ్యతతో జీవించాలని... దేశాన్ని బలోపేతం చేయాలంటే సేవాభావంతో ముందుకు సాగాలని... సమాజం కోసం నిలబడటమే నిజమైన దేశభక్తి అని అల్లూరి సీతారామరాజు జీవితం మనకు నేర్పుతుందని చెప్పుకొచ్చారు. అందరం ఆ మహనీయుని ఆదర్శాల నుంచి స్ఫూర్తి పొంది, న్యాయం, సేవ, దేశభక్తి వంటి విలువలను ఆచరిస్తూ, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో భాగస్వాములం కావాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు.

# ట్రిపుల్ ఐటి విద్యార్థి ఆత్మహత్య

హైదరాబాద్,జూలై4 : గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీలో అభిరూప్ (20) అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆరో అంతస్తు నుంచి కిందికి దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం బయ్యారం గ్రామానికి చెందిన అభిరూప్ ట్రిపుల్ ఐటీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఓ వైపు చదువు ఒత్తిడి, మరోవైపు అనారోగ్య సమస్యలు ఎక్కువ కావడంతో.. తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. ఆరో అంతస్తు నుంచి దూకడంతో తీవ్ర గాయాలపాలై అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు అక్కడి వారు చెబుతున్నారు. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు సంఘటన స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

# పిచ్చికుక్క దాడిలో 40మందికి గాయాలు

అనంతపురం,జూలై4 : రాయదుర్గం పట్టణంలో ఓ పిచ్చికుక్క బీభత్సం సృష్టించింది. శాంతినగర్‌తో పాటు బళ్లారి రోడ్డు, ఓబులాచారి రోడ్డు పరిసర ప్రాంతాల్లో స్వైరవిహారం చేసిన పిచ్చికుక్క దారిన వెళ్లిన వారిపై విచక్షణారహితంగా దాడి చేసింది. ఈ ఘటనలో సుమారు 40 మంది తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. కుక్క దాడి చేయడంతో ప్రజలు భయాందోళనకు గురై ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారు. స్థానికులు అప్రమత్తమై గాయపడిన వారిని వెంటనే రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పిచ్చికుక్క దాడితో ఆ ప్రాంతంలో తీవ్ర భయాందోళన నెలకొంది. చిన్నారులు, వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు రావడానికి కూడా భయపడుతున్న పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటన నేపథ్యంలో పిచ్చి కుక్కల నివారణలో మున్సిపల్ అధికారుల వైఫల్యంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ధైర్యసాహసాలకు నిలువుటద్దం అల్లూరి

**నివాళి అర్పించిన టిడిపి అధ్యక్షుడు పల్లా**

**వవేకానంద, కొణిజేటిలకు కూడా నివాళి**

విశాఖపట్నం,జులై4 : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగం, ధైర్యసాహసాలు, దేశభక్తి భావం భావితరాలకు స్ఫూర్తిదాయకమని తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కొనియాడారు. ఆదివాసీల హక్కుల కోసం పోరాడి బ్రిటిష్ పాలనకు సవాల్ విసిరిన మహావీరుడిగా అల్లూరి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని వ్యాఖ్యానించారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా శనివారం గాజువాకలోని ఆయన విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. అల్లూరి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని దేశ, సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అలాగే, గాజువాకలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఘన నివాళులు అర్పించారు. యువతలో ఆత్మవిశ్వాసం, దేశభక్తి, సేవాభావాన్ని పెంపొందించిన మహనీయుడు స్వామి వివేకానంద అని కొనియాడారు. వివేకానంద చూపిన మార్గం నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. యువత వివేకానంద ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి తమ వంతుగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా పల్లా శ్రీనివాసరావు ఘన నివాళులు అర్పించారు.

# సత్యసాయి ఆస్పత్రిని సందర్శించిన విజయ్ దేవరకొండ

**ఇక్కడ చిన్నారులకు హృద్రోగ చికిత్సలు చేయడం అభినందనీయం.. సత్యసాయి స్కూల్ విద్య వల్లనే ఇంతటి వాడినయ్యానని వెల్లడి**

సిద్దిపేట,జూలై4 : జిల్లాలోని కొండపాక సత్యసాయి సంజీవని శిశు హృదయాలయ హాస్పిటల్‌ను సినీ నటుడు విజయ్ దేవరకొండ, మాజీమంత్రి హరీశ్ రావు సందర్శించారు. ఆస్పత్రిలో 500 మంది చిన్నారులకు గుండె ఆపరేషన్లు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ప్రతి ఏటా 6000 గుండె ఆపరేషన్లు జరుగుతున్నాయని తెలిపారు. ఇక్కడెక్కడి నుంచో పిల్లలు సత్యసాయి ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకుంటున్నారన్నారు. ప్రతి మనిషి తనకు చేతనైన సాయం చేయాలని... మనం చేసిన మంచే చివరకు మిగులుతుందని చెప్పుకొచ్చారు. తన ఏడాది జీతాన్ని ఈ దేవాలయానికి విరాళంగా ఇస్తున్నట్లు హరీశ్ ప్రకటించారు. పుట్టిన బిడ్డ గుండెలో రంధ్రం ఉంది, ప్రాణాలు నిలవడం కష్టం అన్న స్థితిలో వారికి ప్రాణాలు పోస్తే.. ఆ చిన్నారి ప్రాణాలతో పాటు వారి తల్లిదండ్రులు ప్రాణాలనూ కాపాడినట్లు అవుతుందన్నారు. ఈ ఆస్పత్రిని రాబోయే రోజుల్లో రీసెర్చ్ సెంటర్‌గా అభివృద్ధి చేస్తామని ఛైర్మన్ చెప్పారన్నారు. తెలంగాణ నుంచి స్వతహాగా హీరోగా ఎదిగిన వ్యక్తి విజయ్ దేవరకొండ అని.. ఎంత



ఎదిగినా ఒదిగి ఉండే స్వభావం ఆయనదని కొనియాడారు. కరోనా సమయంలో వేలాది మందికి సాయం అందించారని గుర్తుచేశారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు సత్యసాయి స్కూల్లోనే విజయ్ దేవరకొండ చదివారన్నారు. ఇక్కడ కులం, మతం లేదని.. ఆపదలో ఉన్న పిల్లలకు సేవలందిస్తున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. అనంతపురంలో ఓ వ్యక్తి ఏర్పాటు చేసిన వ్యవస్థ ఎన్నో రకాల సేవలందిస్తోందని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. 'ఈరోజు నేను ఇలా ఉన్నానంటే సత్యసాయి స్కూల్లో అందించిన విద్యే కారణం. కొందరు వ్యక్తులు చూపించే ప్రేమ, దయ వల్ల అనేక మంది జీవితాలు మారిపోతాయి. అలాంటి ప్రేమను చూపించిన గొప్ప వ్యక్తి సత్యసాయి. ఇక్కడ చికిత్స పొందిన చిన్నారులు రేపు ఎలాంటి మార్పులు తీసుకొస్తారో సమాజం చూస్తుంది. ఒక లీడర్ తీసుకున్న నిర్ణయం ఈ ప్రాంతానికి, పిల్లల వైద్యానికి ఎంతో మేలు చేస్తోంది. హరీశ రావు తీసుకున్న నిర్ణయం, శ్రమ వల్ల ఇంత గొప్ప ఆస్పత్రి ఇక్కడికి వచ్చింది. చైర్మన్ శ్రీనివాస్, ఆయన వైద్య బృందం చేస్తున్న సేవలు వెలకట్టలేనివి' అని విజయ్ దేవరకొండ కొనియాడారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో గుండె చికిత్సలు పొందుతున్న చిన్నారులతో వారిద్దరూ

# మావిగన్ పేలని రాజకీయ గన్

**అయోమయ ప్రకటనలతో రాజకీయ పబ్బం**

**జగన్ తీరుపై మండిపడ్డ లంకా దినకర్**

అమరావతి,జులై4 : 'మావిగన్' తూటా లేని గన్ అని.. అది పేలదంటూ ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ సెటైర్ విసిరారు. 'నిన్న మూడు రాజధానులు మా నినాదం అన్నారు.. ఈరోజు మావిగన్ మా నినాదం అన్నారు.. రేపు ఏమిటో అర్థం కానీ అయోమయం జగన్నాధం మా నినాదం అనే విధంగా జగన్ తీరు ఉంది' అంటూ వ్యాఖ్యానించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై లంకా దినకర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాజధానిపై జగన్‌కు కనీస అవగాహన లేదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పం వికసిత్ భారత్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్యేయం స్వర్ణ ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. జగన్ సంకల్పం, ధ్యేయం మాత్రం వినాశక ఏపీ అంటూ మండిపడ్డారు. డబుల్ ఇంజన్ సర్కార్ నేతృత్వంలో రాష్ట్రం సమగ్ర సమ్మిళిత అభివృద్ధి లక్ష్యంగా దూసుకుపోతోందని లంకా దినకర్ అన్నారు. హార్టికల్చర్ హబ్‌గా 1 లక్ష కోట్ల పెట్టుబడితో రాయలసీమ, మార్కాపురం జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ఆంధప్రదేశ్ జీవనాడిగా, పోలవరం- నల్లమల్ల సాగర్ బొల్లాపల్లి ద్వార అనుసంధానం చేసి వెలిగొండ ప్రాజెక్ట్ ద్వారా మార్కాపురం, కడప, నెల్లూరు జిల్లాలకు శాశ్వతంగా కరువుకు పరిష్కారం చూపుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి డబుల్ ఇంజిన్ సర్కార్ కృషి చేస్తోందన్నారు. జగన్ ఈ అభివృద్ధి నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి 'మావిగన్' అని విషం కక్కుతున్నారని మండిపడ్డారు. మిగిలిన ప్రాంత ప్రజలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే ప్రయత్నాలు చేస్తున్నారంటూ లంకా దినకర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# సాయికృష్ణ కేసులో మెజిస్టీరియల్ విచారణ

**విచారణకు హాజరైన తల్లీ, కుటుంబీకులు**

**సిఐ నాగరాజు తన కొడుకును మాయం చేశాడన్న తల్లి**

విజయవాడ,జులై4 : గాదె సాయికృష్ణ కేసుకు సంబంధించి మెజిస్టీరియల్ విచారణ కొనసాగుతోంది. విజయవాడలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన విచారణకు సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి, మేనమామ నాగేశ్వరరావు, మేనత్త శనివారం హాజరై తమ వాంగ్మూలాలను నమోదు చేశారు. ఈ కేసు విచారణ సందర్భంగా పోలీసులపై విజయలక్ష్మి సంచలన ఆరోపణలు చేశారు. తన కుమారుడు సాయికృష్ణను పోలీసులే చంపేసి, అనంతరం మృతదేహాన్ని మాయం చేశారని ఆరోపించారు. కృష్ణలంక పోలీసుస్టేషన్‌లో తన కుమారుడు ఉన్నట్లు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లామని తెలిపారు. అయితే, అప్పటి సీఐ నాగరాజు తన కుమారుడిని చూపకుండా వెనక్కి పంపించారని ఆమె వెల్లడించారు. ఈ కేసులో తమ కుటుంబానికి న్యాయం చేయాలని విచారణాధికారిని విజయలక్ష్మి వేడుకున్నారు. దాదాపు రెండు గంటలకు పైగా మెజిస్ట్రీరియల్ విచారణ కొనసాగింది. ఈ కేసులో పూర్తి నిజాలు వెలుగులోకి రావాలంటే సమగ్ర, నిష్పాక్షిక విచారణ అవసరమని డిమాండ్ చేశారు. ఈ కేసు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారగా, మేజిస్ట్రేట్ విచారణలో వెలుగులోకి వచ్చే అంశాలు కీలకంగా మారనున్నాయి.

# ఐఐటి ఖరగ్‌పూర్‌లో తెలంగాణ విద్యార్థి ప్రతిభ

ఖరగ్‌పూర్,జూలై4 : ఐఐటీ ఖరగ్‌పూర్ 72వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. తెలంగాణకు చెందిన కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థి కంచర్ల ప్రణవ్ రెండు బంగారు, ఒక వెండి పతకం సాధించాడు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర సహాయ మంత్రి ముజుందార్, ఆచార్య నిచోలాస్ బి.డ్రిర్స్, విశిష్ట అతిథిగా రాష్ట్ర మంత్రి దిలీప్ ఘోష్ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 3936 మంది విద్యార్థులకు పట్టాలు అందజేశారు.

# యువతకు కండరాలు పెంచే స్టెరాయిడ్స్

**అక్రమంగా ఇంజక్షన్లు విక్రయిస్తున్న ముఠా**

**వలపన్ని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు**

హైదరాబాద్,జూలై4 : క్షణాల్లో కండరాలు పెంచుకోవాలనే యువత ఆకాంక్షను ఆసరాగా చేసుకుని అక్రమంగా స్టెరాయిడ్స్ ఇంజెక్షన్లు విక్రయిస్తున్న ముఠాను హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్, ముషీరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో మొత్తం ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.6.50 లక్షల విలువైన 770కి పైగా స్టెరాయిడ్స్ వయల్స్, యాంపుల్స్, ఇంజెక్షన్లతో పాటు మొబైల్ ఫోన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ తెలిపిన వివరాల ప్రకారం.. 'డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండానే జిమ్ ట్రైనర్లు స్టెరాయిడ్స్‌ను ఆన్‌లైన్ ద్వారా తెప్పించి యువతకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. ఆన్‌లైన్ జిమ్ ట్రైనర్ బట్టే శివ, మహమ్మద్ ఫుర్ఖానుద్దీన్ ఫైసల్‌తో పాటు మరో నలుగురు సబ్-సెల్లర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన 'మెడ్‌హౌస్ ఫార్మా', పంజాబ్‌కు చెందిన 'షిప్ రాకెట్' వంటి ఆన్‌లైన్ వేదికల ద్వారా స్టెరాయిడ్స్ కొనుగోలు చేసి, కొరియర్ సేవల ద్వారా హైదరాబాద్‌కు తెప్పించి విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముదిద్ చౌహాన్, పంజాబ్‌కు చెందిన రాజన్ ప్రీత్ సింగ్ పరారీలో ఉన్నారని' తెలిపారు. ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నిందితులపై రెండు వేర్వేరు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అలాగే కొంతమంది యువకులు కృత్రిమ మేధస్సు (ఏఐ) సాయంతో నకిలీ వైద్యుల ప్రిస్క్రిప్షన్లు రూపొందించి మెడికల్ షాపుల నుంచి కూడా స్టెరాయిడ్స్ కొనుగోలు చేస్తున్నట్లు విచారణలో బయటపడిందని తెలిపారు. జిమ్ యజమానులు, ట్రైనర్లు, సభ్యుల కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచుతామని, నగరంలోని జిమ్‌లలో ఇకపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ వైభవ్ గైక్వాడ్ స్పష్టం చేశారు.

# బావిలో పడ్డ ఎద్దును రక్షించబోయి మృత్యువాత


**ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం**

భోపాల్,జులై4 : బావిలో పడిన ఎద్దును రక్షించబోయి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటన మధ్యప్రదేశ్ లోని సత్నా జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖరమ్‌సేద గ్రామంలో శుక్రవారం రాత్రి 8.30 గంటల సమయంలో ఓ ఎద్దు ప్రమాదవశాత్తు బావిలో పడింది. దానిని రక్షించడానికి ఇద్దరు వ్యక్తులు తాడు సాయంతో 40 అడుగుల బావిలోకి దిగారు. వారి నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో మరో ఇద్దరు బావిలోకి దిగారు. కొన్ని నిమిషాల తర్వాత వారు కూడా తిరిగిరాలేదు. దీంతో లోపల ఏదో ప్రమాదం పొంచి ఉందని గుర్తించిన స్థానికులు తాళ్లు, కొక్కాల సాయంతో 3 గంటల పాటు శ్రమించి నలుగురిని బయటకు తీశారు. వెంటనే వారిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే ముగ్గురు ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. మృతులను ఒకే కుటుంబానికి చెందిన రాహుల్ యాదవ్ (36), వీరేంద్ర యాదవ్ (40), కృష్ణదత్ యాదవ్ (26)గా గుర్తించారు. చాలాకాలం పాటు బావి మూసి ఉండడంతో భారీగా చెత్త పేరుకుపోయిందని.. విషవాయువులు వెలువడి అందులోకి దిగినవారు

మృతిచెందినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పోలీసులు వెల్లడించారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామన్నారు.

# ఇరాక్ ఎంపి అవినీతి బట్టబయలు

**బంగారంతో లోదుస్తుల తయారీ**



బాగ్దాద్,జులై4 : బాత్‌రూమ్‌లోని కమోడ్‌లను కూడా కొందరు సంపన్నులు బంగారంతో తయారు చేసుకున్న ఉదంతాలు మనకు తెలుసు. కానీ ఇరాక్‌లోని ఒక ఎంపీ ఇంటిపై దాడి చేసిన అవినీతి నిరోధక శాఖ అధికారులు విలువైన వజ్రాలు, బంగారం, కట్టల కట్టల డబ్బు, ఖరీదైన వస్తువులను చూసి ఆశ్చర్య పోలేదు కానీ, బంగారంతో తయారు చేసిన ఖరీదైన లో దుస్తుల జతను చూసి షాక్ తిన్నారు. దీంతో ఈ బికినీ జత సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారింది. తీవ్ర అవినీతి ఆరోపణలు ఉన్న ఈ మహిళా ఎంపీ అలియా నస్సీఫ్ ఇంటి నుంచి అధికారులు 1.33 కోట్ల డాలర్లు అంటే సుమారు రూ. 148 కోట్లు నగదు, బంగారం, నగలు, వజ్రాలు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. భవనాలు, ఇతర ఆస్తులను కూడా ఆధీనంలోకి తీసుకున్నారు. మొత్తం పట్టుబడిన అక్రమ ఆస్తుల విలువ 8.5 కోట్ల డాలర్లు సుమారు రూ. 809 కోట్లు ఉంటుందని చెప్పారు.



## తొలిరోజు మంచులింగం దర్శించుకున్న 12 వేల మంది భక్తులు

జమ్ము,జులై4 : కట్టుదిట్టమైన భద్రత... వాతావరణ అవాంతరాల మధ్య ... హర హర మహాదేవ్ అంటూ... బయల్దేరిన భక్తులకు ఈ ఏడాది అమరనాథ్ మంచుశివలింగ తొలి దర్శనమైంది. అమరనాథ్‌యాత్రలో భాగంగా శుక్రవారం తొలిరోజు 12 వేల మంది భక్తులు మంచులింగాన్ని దర్శించుకున్నారు. జమ్మూకశ్మీర్‌లోని హిమాలయాల్లో ఏటా ఈ సమయంలో ఏర్పడే మంచు లింగాన్ని పూజించేందుకు గురు, శుక్రవారాల్లో నువ్వాన్, బాల్‌టాల్ బేస్ క్యాంపుల నుంచి రెండు బృందాలు బయలుదేరాయి. శుక్రవారం దర్శనం చేసుకున్నవారిలో 9,350 మంది పురుషులు, 2,250 మంది మహిళలు, 200 మంది పిల్లలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

## ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం ఏర్పరచుకుంటా

**20 ఏళ్ల రాజకీయ ప్రస్థానంపై రేవత్ భావోద్వేగ పోస్ట్**



హైదరాబాద్,జులై4 : ఇరవై ఏళ్ల రాజకీయ ప్రస్థానం తన జీవితంలో ప్రత్యేక అధ్యాయమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. తన రెండు దశాబ్దాల రాజకీయ ప్రస్థానం గురించి ఎక్స్‌లో భావోద్వేగ పోస్ట్ చేశారు. ఈ 20వసంతాల ప్రయాణం ఎన్నో విజయాలు, మరెన్నో సవాళ్లు... ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం...అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజలతోనే తన అనుబంధాన్ని కొనసాగించినట్లు తెలిపారు. మిడ్జిల్‌లో సాధారణ రాజకీయ కార్యకర్తగా ప్రారంభమైన తన ప్రయాణం, ఇవాళ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ప్రజల గుండెల్లో 'రేవంతన్న'గా నిలిచే స్థాయికి చేరడం వెనుక ప్రజల విశ్వాసమే కారణమని సీఎం పేర్కొన్నారు. లక్షల అక్షరాలతో రాసినా... కోట్ల పదాలతో చెప్పినా... ఈ రెండు దశాబ్దాల ప్రజా జీవితం ఒక మధుర జ్ఞాపకమని పేర్కొన్న రేవంత్ రెడ్డి... ప్రతి సందర్భంలో, ప్రతి సంఘటనలో, ప్రతి సంఘర్షణలో తనతో కలిసి నడిచిన ప్రజలు, కార్యకర్తలు, ఆత్మీయులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ప్రజలకు మరింత సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతానని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ పునర్నిర్మాణంలో శ్రామికుడిగా, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే సేవకుడిగా తన బాధ్యతను నిర్వర్తిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా మాత్రమే కాకుండా...'రేవంతన్న'గా ప్రజల హృదయాల్లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటానని భావోద్వేగంగా పేర్కొన్నారు.






# యుద్ధం వేళ ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

**ఇంధనంపై ప్రజలను భయపెట్టే యత్నాలు జరిగాయి.. అయితే సమర్ధంగా సవాళ్లను అధిగమంచగలిగాం**

**రాజస్థాన్‌లో గ్రీన్ రిఫైనరీని ప్రారంభించిన ప్రధాని మోడీ**

జయపుర,జులై4 :పశ్చిమాసియా సంక్షోభం వేళ దేశంలో ఇంధన సంక్షోభాన్ని విజయవంతం ఎదుర్కొన్నట్లు ప్రధాని మోడీ అన్నారు. ప్రజలను భయపెట్టే ప్రయత్నాలు జరిగాయి. రాజకీయాలు చేశారు. కానీ వారి కుట్రలు ఫలించలేదు. కొన్ని చిన్న చిన్న ఇబ్బందులు తప్ప దేశంలో ఎక్కడా ఇంధన సరఫరా ఆగలేదని అన్నారు. శనివారం రాజస్థాన్‌లోని బాలోత్రా జిల్లా పచ్‌పద్రాలో దేశంలోని తొలి గ్రీన్‌ఫీల్డ్ సమగ్ర రిఫైనరీ-పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను మోడీ ప్రారంభించారు. సుమారు రూ.1.06 లక్షల కోట్ల విలువైన పెట్రోకెమికల్స్, రైల్వేలు, రహదారులు, మెట్రో, పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ ప్రసార ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. దేశ ఇంధన భద్రత, పశ్చిమాసియా యుద్ధం సమయంలో భారత్ ఎదుర్కొన్న సవాళ్లు, వాటిని అధిగమించిన విధానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన మార్కెట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని ప్రధాని తెలిపారు. ఈ సమయంలో భారత్‌లో ఇంధన కొరత వస్తుందని కొందరు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ప్రతిపక్షాలను ఉద్దేశించి ఆరోపించారు. ఏప్రిల్ నుంచి జూన్ మధ్యకాలంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వ చమురు మార్కెటింగ్ సంస్థలు రూ.75 వేల కోట్లకు పైగా నష్టాన్ని భరించాయని తెలిపారు. ప్రజలపై భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం లీటరుకు రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని కూడా తగ్గించిందని పేర్కొన్నారు. భారత్‌కు పెద్దగా చమురు నిల్వలు లేవని గుర్తుచేసిన ప్రధాని.. యుద్ధం సమయంలో ముడి చమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుంచి 120 డాలర్లకు పెరిగిందన్నారు. కొన్ని దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు 40-50 శాతం పెరగడమే కాకుండా రేషన్ విధానం కూడా అమలు చేశారని చెప్పారు. అయితే భారత్‌లో మాత్రం ఒక్కరోజు కూడా ఇంధన కొరత తలెత్తలేదని స్పష్టం చేశారు. సంక్షోభానికి ముందు భారత్ కేవలం 25-26 దేశాల నుంచే ఇంధనం దిగుమతి చేసుకునేదని.. కానీ యుద్ధం ప్రారంభమైన తర్వాత భారత దౌత్యపరమైన ప్రయత్నాల వల్ల 40కిపైగా దేశాల నుంచి చమురు, ఇంధనం దిగుమతి చేసుకున్నామని ప్రధాని వెల్లడించారు. దేశ ప్రయోజనాలు, ప్రజల సంక్షేమమే భారత్‌కు అత్యంత ప్రాధాన్యం అనే సందేశాన్ని ప్రపంచానికి ఇచ్చామని అన్నారు. భారత్‌కు అవసరమైన ఎల్పీజీలో దాదాపు 60 శాతం దిగుమతుల ద్వారానే వచ్చేదని.. అందులో 90 శాతం హార్ముజ్ జలసంధి మార్గంలో గల్ఫ్ దేశాల నుంచే వచ్చేదని తెలిపారు. యుద్ధం కారణంగా సరఫరా దాదాపు నిలిచిపోయిన సమయంలో రిఫైనరీల సామర్థ్యాన్ని వినియోగించి కేవలం ఏడు రోజుల్లోనే దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని 35 వేల మెట్రిక్ టన్నుల నుంచి 54 వేల మెట్రిక్ టన్నులకు పెంచామని చెప్పారు. ఇప్పటివరకు ఎల్పీజీ ఉత్పత్తి చేయని కొన్ని ర్గి÷నైరీలను కూడా ఈ అవసరానికి అనుగుణంగా మార్చినట్లు తెలిపారు.దేశవ్యాప్తంగా పైప్ ద్వారా సహజ వాయువు కనెక్షన్లను వేగంగా విస్తరించామని, 11 లక్షలకుపైగా కుటుంబాలకు కొత్త పీఎన్‌జీ కనెక్షన్లు అందించామని ప్రధాని వెల్లడించారు.మార్కెట్ అంచనాల ప్రకారం గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.2,000 వరకు చేరే అవకాశం ఉన్నప్పటికీ.. ప్రస్తుతం రూ.950లోపే అందిస్తున్నామని పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం 21వ శతాబ్దంలోనే అతిపెద్ద ఇంధన సంక్షోభానికి కారణమైందన్నారు. సమస్యను ముందుగానే అంచనా వేసి సరైన నిర్ణయాలు తీసుకున్నాం. దేశ వనరులను సమర్థంగా వినియోగించాం. దౌత్య శక్తిని సానుకూలంగా ఉపయోగించాం. అందుకే భారత్ ఈ సంక్షోభాన్ని విజయవంతంగా అధిగమించిందని చెప్పారు. ఇర పచ్‌పద్రా రిఫైనరీతో భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద రిఫైనింగ్ దేశంగా మరింత బలోపేతమవుతోందని ప్రధాని తెలిపారు. ఈ సమగ్ర ర్గి÷నైరీకి ఏడాదికి 2.4 మిలియన్ మెట్రిక్ టన్నుల పెట్రోకెమికల్ ఉత్పత్తి సామర్థ్యం ఉందన్నారు. ఇది దేశ ఇంధన భద్రతను పెంచడంతో పాటు పెట్రోకెమికల్ రంగంలో స్వయం సమృద్ధికి దోహదపడుతుందని.. వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అదనంగా జైపూర్ మెట్రో రెండో దశ, రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, బికానేర్ సోలార్ పార్కులు, విద్యుత్ ప్రసార లైన్లు సహా పలు అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ప్రధాని దేశానికి అంకితం చేశారు.

# పార్లమెంట్ వర్షాకాల షెడ్యూల్ ఖరారు

**జూలై20 నుంచి ఆగస్ట్ 13 వరకు సమావేశాలు**

**ఎక్స్ వేదికగా వెల్లడించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు**



న్యూఢిల్లీ,జులై4 : పార్లమెంట్ వర్షాకాల సమావేశాల షెడ్యూల్ ఖరారయ్యింది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోషల్ మీడియా ఎక్స్‌లో పేర్కొన్నారు. జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు సమావేశాలు జరగనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సిఫారసు మేరకు పార్లమెంట్ 2026 వర్షాకాల సమావేశాలను నిర్వహించేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. దేశ ప్రాధాన్యత కలిగిన కీలక అంశాలపై అర్థవంతమైన చర్చలు, సమగ్ర చర్చోపచర్చలు, నిర్ణయాలు తీసుకునేందుకు ఈ సమావేశాలు వేదిక కానున్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇక ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశముండగా దేశ ఆర్థిక వ్యవస్థ, జాతీయ భద్రత, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమం, ఇతర సమకాలీన అంశాలపై కూడా ఇరు సభల్లో విస్తృతంగా చర్చలు జరిగే అవకాశం ఉంది. అలాగే ప్రతిపక్ష పార్టీలు కూడా వివిధ ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించే అవకాశముంది. ఇటీవలి పరిణామాలు, దేశీయ, అంతర్జాతీయ అంశాలతో పాటు పలు రాష్ట్రాలకు సంబంధించిన సమస్యలను కూడా ప్రతిపక్ష పార్టీలు ఈ సమావేశాల్లో ప్రస్తావించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం కూడా తన కీలక విధానాలు, సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను సభ ముందుకు తీసుకురానుంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందు ముగియనున్న ఈ సమావేశాల్లో పలు కీలక నిర్ణయాలు, చర్చలు జరిగే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వర్షాకాల సమావేశాల్లో ఎన్డీఏ ప్రభుత్వం పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా రెండు రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకురానున్నట్లు తెలుస్తోంది. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజనను సవరణలతో మళ్లీ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ బిల్లులో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల సభ్యుల సంఖ్యను 50 శాతం పెంచే ప్రతిపాదన కూడా ఉండొచ్చని సమాచారం. ఇక ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీయడానికి సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం, అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, నిరుద్యోగ సమస్య వంటి అంశాలపై కేంద్రాన్ని ఇరుకున పెట్టేందుకు వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం. దీంతో ఈసారి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు హాట్ హాట్‌గా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి.



లస్యాలి చిత్రం






## రాజమౌళికి అరుదైన గౌరవం

**వాల్ ఆఫ్ ఫిల్మ్ మేకర్స్'లో చోటు**

తెలుగు సినిమా గ్లోబల్ స్థాయికి వెళ్ళిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళికి ఫ్రాన్స్ లో మరొక అరుదైన గౌరవం దక్కింది. ఫ్రాన్స్ లోని లూమియర్ ఇన్స్టిట్యూట్, దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళిని ప్రత్యేకంగా సత్కరించింది. అక్కడి 'వాల్ ఆఫ్ ఫిల్మ్ మేకర్స్' పై ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ దర్శకుల పేర్లు ఉన్నాయి. ఇప్పుడు రాజమౌళి పేరు కూడా ఆ జాబితాలో చేరింది. ఈ ప్రోగ్రామ్ లో రాజమౌళి తెరకెక్కించిన 'ఈగ', 'ఆర్ఆర్ఆర్' సినిమాలను ప్రదర్శించారు. 2012 లో విడుదలైన 'ఈగ', చిన్న కాన్సెప్ట్ ను కొత్తగా చూపించిన సినిమాగా గుర్తింపు పొందింది. ఇక 'ఆర్ఆర్ఆర్' ప్రపంచవ్యాప్తంగా విడుదలై పలు అంతర్జాతీయ అవార్డులు అందుకోవడంతో పాటు, భారతీయ సినిమాపై విదేశీ ప్రేక్షకుల దృష్టిని మరింత ఆకర్షించింది. ఇటీవలే పారిస్ లోని 'సినిమాథెక్ ఫ్రాంకైస్' థియేటర్ లో రాజమౌళి పేరుతో శాశ్వత సీటును కేటాయించగా, ఇప్పుడు లూమియర్ ఇన్స్టిట్యూట్ జక్కన్న చిత్రాలతో ప్రత్యేక రెట్రోస్పెక్టివ్ ను నిర్వహిస్తుంది. 'బాహుబలి', 'ఈగ', 'ఆర్ఆర్ఆర్' లాంటి చిత్రాలను ప్రదర్శిస్తూ, భారతీయ సినిమాలపై అంతర్జాతీయ ప్రేక్షకుల్లో ఆసక్తి ఎలా పెరుగుతోందో ఈ కార్యక్రమం మరోసారి చూపిస్తుంది.




## శరవేగంగా ప్రభాస్ స్పిరిట్ షూటింగ్

**నగర శివారులో జెట్ స్పీడ్‌తో చిత్రీకరణ**

రెబల్ స్టార్ ప్రభాస్, సెన్సేషనల్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్పిరిట్' షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన తాజా అప్‌డేట్ అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జెట్ స్పీడ్‌లో సాగుతుండగా.. చిత్ర బృందం ఎలాంటి విరామం లేకుండా వరుస షెడ్యూళ్లతో దూసుకెళు తోంది. స్పిరిట్ షూటింగ్‌లో ఇప్పటికే దాదాపు 70 శాతం పూర్తయినట్లు, కేవలం 30 శాతం చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా కోసం ప్రభాస్ కూడా పూర్తిస్థాయిలో సమయం కేటాయిస్తూ.. ప్రతి యాక్షన్ సన్నివేశాన్ని డూప్ లేకుండా స్వయంగా చేస్తున్నారని సమాచారం. యాక్షన్ సీక్వెన్స్‌లలో ప్రభాస్ అంకితభావం చిత్ర యూనిట్‌ను కూడా ఆకట్టుకుంటోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక దర్శకుడు సందీప్ రెడ్డి వంగా పనితీరు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రీ-ప్రొడక్షన్ దశలోనే ప్రతి సన్నివేశాన్ని, షూటింగ్ షెడ్యూల్‌ను పక్కాగా సిద్ధం చేసుకునే ఆయన.. సెట్స్‌పైకి వెళ్లిన తర్వాత మాత్రం శరవేగంగా చిత్రీకరణ పూర్తి చేసే దర్శకుడిగా పేరొందాడు. 'స్పిరిట్' విషయంలోనూ అదే వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

## జన్మభూమిపై సెన్సార్ పుకార్లు


బాలీవుడ్ స్టార్ నటుడు సల్మాన్ ఖాన్ నటిస్తూ.. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న తాజా చిత్రం 'మాతృభూమి'. వార్ డ్రామాగా వస్తున్న ఈ సినిమా సెన్సార్ బోర్డ్ వద్ద నిలిచిపోయిందని, సర్టిఫికేషన్ ప్రక్రియలో సమస్యలు ఎదుర్కొంటుందంటూ మీడియాలో వస్తున్న పలు ధనాలపై స్పందించింది చిత్రబృందం. మీడియాలో వస్తున్న వార్తలను అవాస్తవాలని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టింది. 'మాతృభూమి' సినిమా సెన్సార్ బోర్డు వద్ద ఇబ్బందులు ఎదుర్కొంటోందని వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని మేకర్స్ స్పష్టం చేశారు. అసలు ఈ సినిమాను ఇప్పటివరకు సెన్సార్ సర్టిఫికేషన్ కోసం సీబీఎఫ్‌సీకి సమర్పించనేలేదని, అలాంటప్పుడు పక్రియ నిలిచిపోయిందనే ప్రచారానికి అర్థం లేదని వారు తేల్చి చెప్పారు. మీడియా సంస్థలు మరియు సోషల్ మీడియా వినియోగదారులు ఇలాంటి వెర్గి÷ చేయని సమాచారాన్ని, పుకార్లను షేర్ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. సినిమాకు సంబంధించిన ఎలాంటి అధికారిక అప్‌డేట్స్ అయినా సల్మాన్ ఖాన్ ఫిల్మ్స్ అధికారిక ఛానెల్స్ ద్వారా మాత్రమే పంచుకుంటామని వారు స్పష్టం చేశారు. అంతకుముందు ఈ చిత్రం ఈద్ కానుకగా ఏప్రిల్ 17న విడుదల కావాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. ఆ తర్వాత స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఆగస్ట్‌లో విడుదల చేయాలని ప్లాన్ చేశారు. అయితే తాజా పరిస్థితులను బట్టి చూస్తే ఈ చిత్రం ఆగస్ట్ రేస్ నుండి కూడా తప్పుకుని మరింత ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది. ఈ చిత్రానికి అపూర్వ లఖియా దర్శకత్వం వహిస్తుండగా, సల్మాన్ ఖాన్ హోమ్ బ్యానర్‌పై సల్మా ఖాన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మొదట ఈ సినిమాకు 'బాటిల్ ఆఫ్ గల్వాన్' అనే టైటిల్‌ను అనుకున్నారు. వివాదాల నేపథ్యంలోనే చిత్ర బృందం టైటిల్‌ను 'బాటిల్ ఆఫ్ గల్వాన్' నుండి 'మాతృభూమి'గా మార్చింది.



## నేనూ కాస్టింగ్ కౌచ్ ఎదుర్కొన్నా

సినీ ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్‌పై ఎన్నో ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. చాలామంది భయంతో బయటకు చెప్పకుండా మౌనం పాటిస్తుంటే, కొంతమంది మాత్రం సమయం వచ్చినప్పుడు తాము ఎదుర్కొన్న చేదు అనుభవాలను ధైర్యంగా పంచుకుంటున్నారు. తాజాగా ప్రముఖ నటి పరిణీత బోర్తకుర్ కూడా తన కెరీర్ ప్రారంభంలో ఎదురైన ఒక షాకింగ్ సంఘటనను బయటపెట్టడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పరిణీత బోర్తకుర్ సౌత్ సినీ ఇండస్ట్రీలో తనకు ఎదురైన అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. సినీ రంగంలో చేదు అనుభవాలు తాను కూడా ఎదుర్కొన్నానని ఆమె స్పష్టం చేశారు. అయితే ఈ పరిశ్రమలో ఒక మంచి విషయం కూడా ఉందని, ఒక వ్యక్తి అనుమతి లేకుండా ఎవరూ ఏమీ చేయలేరని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో మన ప్రవర్తన కూడా కీలకంగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. తన కెరీర్ ప్రారంభ దశలో ఒక దక్షిణాది సినిమా కోసం తన ఫొటోలు షార్ట్‌లిస్ట్ అయ్యాయని సమాచారం వచ్చిందని పరిణీత చెప్పారు.






## నెట్‌ఫ్లిక్స్‌లో ఫిక్స్ పెద్ది

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన 'పెద్ది' మూవీ ఓటిటి రిలీజ్ డేట్ కన్ఫామ్ అయ్యింది. థియేటర్లలో సూపర్ హిట్‌గా నిలిచిన ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. 'ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ తేదీని అధికారికంగా ప్రకటించింది. జూలై 9 నుంచి ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి రానుంది. ెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో కూడా ఒకేసారి విడుదల చేయనున్నట్లు నెట్‌ఫ్లిక్స్ వెల్లడించింది. దీంతో థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు ఇంట్లోనే ఈ చిత్రాన్ని ఆస్వాదించే అవకాశం దక్కనుంది. విడుదలైన తొలి రోజు నుంచే 'పెద్ది'కి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది.

## ప్యారడైజ్ మూవీపై నాని ఫోకస్

కొత్త చిత్రాలకు డేట్లు కుదరక నో




నేచురల్ స్టార్ నాని హీరోగా, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ది ప్యారడైజ్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రం కావడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో నాని 'జడల్' అనే పూర్తి స్థాయి మాస్ పాత్రలో కనిపించనున్నారు. ఆయనకు జోడీగా కయాదు లోహర్

'సుబ్బలక్ష్మి' పాత్రలో నటిస్తోంది. విలక్షణ నటుడు మోహన్ బాబు ప్రధాన ప్రతినాయకుడిగా కనిపించనుండగా, సోనాలి కులకర్ణి, రాఘవ్ జుయల్, సంపూర్ణేశ్ బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, జీకే విష్ణు సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మొదట ఈ సినిమాను ఆగస్టు 21న విడుదల చేయాలని భావించినప్పటికీ, నిర్మాణ పనులు ఆలస్యం కావడంతో విడుదల తేదీ సెప్టెంబర్ 25కు మారే అవకాశాలు ఉన్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ది ప్యారడైజ్'పై పూర్తి దృష్టి పెట్టిన నాని, ఇతర సినిమాలను తాత్కాలికంగా పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. షూటింగ్ ఆలస్యం కావడం వల్ల ఆయన రెండు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను వదులుకోవాల్సి వచ్చినట్లు సమాచారం. మొదటిది, 'హాయ్ నాన్న' దర్శకుడు శౌర్యువ్ సిద్ధం చేసిన కొత్త సినిమా. కథ నచ్చినా డేట్స్ అందుబాటులో లేకపోవడంతో, ఆ ప్రాజెక్ట్‌ను వేరే హీరోతో ముందుకు తీసుకెళ్లాలని నాని సూచించినట్లు తెలుస్తోంది.



# ఇక డాక్టర్ వెంకటేశ్ అయ్యర్!

సాధారణంగా క్రీడాకారులు తమ కెరీర్ కోసం చదువుపై పెద్దగా శ్రద్ధ పెట్టరు. ఒకవేళ ఫోకస్ పెట్టినా.. కెరీర్ కోసం మధ్యలోనే వదిలేస్తారు. అందుకే చాలా మంది స్టార్ క్రికెటర్లు, వరల్డ్ బెస్ట్ ప్లేయర్లకు కూడా కనీస విద్యార్హత డిగ్రీ కూడా ఉండదు. టీమిండియా దిగ్గజ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, సచిన్ టెండూల్కర్ ఇంటర్మీడియట్‌తోనే చదువును ఆపేయగా.. ధోనీ డిగ్రీని మధ్యలో వదిలేసాడు. కెరీర్‌లో బిజీగా ఉండటంతో ఈ దిగ్గజ ఆటగాళ్లంతా చదువును పక్కనపెట్టేసారు. అయితే అతి కొద్ది మంది మాత్రమే క్రీడా జీవితాన్ని కొనసాగిస్తూ ఉన్నత చదువులు చదివారు. అలాంటి అరుదైన జాబితాలోకి టీమిండియా ఆల్‌రౌండర్, ఆర్‌సీబీ స్టార్ వెంకటేశ్ అయ్యర్ వస్తాడు. భారత క్రికెట్ చరిత్రలోనే అత్యధిక విద్యార్హత కలిగిన ఏకైక ప్లేయర్ వెంకటేశ్ అయ్యర్ అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అతి త్వరలోనే అతను డాక్టర్ వెంకటేశ్ అయ్యర్‌గా మారిపోనున్నాడు. క్రికెట్‌తో పాటు చదువులో రాణిస్తున్న సవ్యసాచి వెంకటేశ్ అయ్యర్. ఇండోర్‌లోని ప్రఖ్యాత 'దేవి అహల్యా విశ్వవిద్యాలయం' నుంచి వెంకటేశ్ అయ్యర్ ఫైనాన్స్ అండ్ ఇంటర్నేషనల్ బిజినెస్ విభాగంలో (మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) పూర్తి చేశాడు. ఇండోర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ నుంచి (బ్యాచిలర్ ఆఫ్ కామర్స్) డిగ్రీ పట్టా అందుకున్నాడు. వెంకటేశ్ అయ్యర్ సీఏ ఇంటర్మీడియట్ పరీక్షలను కూడా క్లియర్ చేశారు. ఆ సమయంలోనే ఆయనకు 'బిగ్ ఫోర్' అకౌంటింగ్ సంస్థల్లో ఒకటైన డెలాయిట్ నుంచి క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో 15 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం కూడా వచ్చింది. కానీ క్రికెట్‌పై ఉన్న మక్కువతో ఆ ఉద్యోగ అవకాశాన్ని వదులుకుని పూర్తిస్థాయి క్రికెటర్‌గా మారాడు. అయినా తనకు ఇష్టమైన చదువును వెంకటేశ్ అయ్యర్ పక్కనపెట్టలేదు. ఐపీఎల్‌తో పాటు టీమిండియా తరఫున కోట్లు ఆర్జించినా.. చదువుపై తన మక్కువను కొనసాగిస్తున్నాడు. ప్రస్తుతం ఫినాన్స్‌లో పీహెచ్‌డీ చేస్తున్నాడు. త్వరలోనే డాక్టర్ వెంకటేశ్ అయ్యర్‌గా మారిపోనున్నాడు. ఈ తరం క్రీడాకారులంతా వెంకటేశ్ అయ్యర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని నెటిజన్లు సూచిస్తున్నారు. ఏ రంగంలో రాణించినా చదువును అశ్రద్ధ చేయవద్దని హితవు పలుకుతున్నారు. బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్ కూడా ఓ ఇంటర్వ్యూలో ఇదే విషయాన్ని చెప్పారు. అథ్లెట్లు తమ క్రీడలతో పాటు చదువులపై కూడా ఫోకస్ పెట్టాలని సూచించారు. అందరికి సక్సెస్ రాదని, అలాంటి పరిస్థితుల్లో చదువు ఉపయోగపడుతుందని చెప్పారు.



# వైభవ్ సూర్యవంశీని ఓదార్చిన సంజూ శాంసన్!

ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న టీమిండియా..వర్షం కారణంగా రద్దయిన తొలి టీ20లో మోస్తారు ప్రదర్శన కనబర్చింది. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా మరికొద్ది సేపట్లో మాంచెస్టర్ వేదికగా ప్రారంభమయ్యే రెండో టీ20లో బరిలోకి దిగనుంది. ఈ మ్యాచ్ కోసం టీమిండియా అన్ని విధాల సిద్ధమైంది. ముఖ్యంగా భారత బ్యాటర్లు నెట్స్‌లో ముమ్మర సాధన చేశారు. ఈ సిరీస్ నేపథ్యంలో టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఈ 15 ఏళ్ల కుర్రాడు అంతర్జాతీయ అరంగేట్రం కోసం సిద్ధంగా ఉన్నాడు. అభిమానులు కూడా వైభవ్ అరంగేట్రం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే, అతనికి తుది జట్టులో అవకాశం రావడానికి మరికొంత సమయం పడుతుందని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ హింట్ ఇచ్చారు. ప్రాక్టీస్ సెషన్‌లో వయసులో చాలా చిన్నవాడైన వైభవ్ సూర్యవంశీని జట్టులోని సీనియర్ ఆటగాళ్లు ఎంతో గారాబంగా చూసుకుంటున్నారు. అయితే శనివారం ఉదయం జరిగిన నెట్ ప్రాక్టీస్ సెషన్‌లో ఒక ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది. టీమిండియా టాపార్డర్ బ్యాటర్లు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, సంజూ శాంసన్ నెట్స్‌లో సుదీర్ఘ సమయం పాటు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశారు. దాంతో వైభవ్ సూర్యవంశీకి బ్యాటింగ్ ప్రాక్టీస్ చేసేందుకు తగిన సమయం దొరకలేదు. ప్రాక్టీస్‌కు కూడా అవకాశం రాకపోవడంతో వైభవ్ సూర్యవంశీ తీవ్ర నిరాశకు గురయ్యాడు. నెట్స్ బయట ఒంటరిగా కూర్చొని విచారంగా కనిపించాడు.





## కేప్ వెర్డేపై

# అర్జెంటీనా విజయం

### ఆగని మెస్సీ రికార్డుల మోత

ఫుట్‌బాల్ దిగ్గజం, అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ రికార్డుల మోత మోగించాడు. అటు గోల్స్?తో పాటు ఆడిన మ్యాచ్?ల పరంగా సరికొత్త మైలురాళ్లను అందుకున్నాడు. రెండు వేర్వేరు ఫిఫా వరల్డ్ కప్ ఎడిషన్లలో ఏడు చొప్పున గోల్స్ సాధించిన తొలి ఫుట్‌బాలర్‌గా మెస్సీ నిలిచాడు.

**2022 ఖతార్ వరల్డ్ కప్‌లో 7 గోల్స్ చేసిన మెస్సీ, ఇప్పుడు 2026 టోర్నమెంట్‌లో కూడా అదే జోరును ప్రదర్శిస్తున్నాడు. అలాగే, ఫిఫా టోర్నమెంట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా నిలిచాడు. శనివారం అర్జెంటీనాతో ఆఫ్రికన్ దేశం కేప్ వెర్డే జట్టు తలపడింది. ఈ మ్యాచ్‌లో ఆడటం ద్వారా మెస్సీ ఈ ఫీట్‌ను సాధించాడు.**

ప్రపంచకప్‌లో అతనికి ఇది 30వ మ్యాచ్. ఫిఫా వరల్డ్ కప్ చరిత్రలో వరుసగా ఎనిమిది మ్యాచ్‌లలో గోల్స్ చేసిన మొదటి ఆటగాడిగా మెస్సీ మరో చరిత్ర సృష్టించాడు. 29వ నిమిషంలో మెస్సీ చేసిన గోల్?తో ఈ అరుదైన ఫీట్‌ను అందుకున్నాడు. ఈ తాజా గోల్‌తో ఫిఫా వరల్డ్ కప్ చరిత్రలో మెస్సీ ఖాతాలో మొత్తం 20 గోల్స్ చేరాయి. 2022లో ఖతార్ వేదికగా జరిగిన ప్రపంచకప్‌లో అర్జెంటీనాను విజేతగా నిలిపిన మెస్సీ, వరుసగా రెండోసారి ప్రపంచ టైటిల్‌ను కైవసం చేసుకునే దిశగా జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. ప్రస్తుత టోర్నమెంట్‌లోనూ తన అసాధారణమైన విజన్, అనుభవం, గోల్స్ చేసే నైపుణ్యంతో అర్జెంటీనాను నాకౌట్ దశకు చేర్చాడు. ఈ ప్రపంచకప్ 'గోల్డెన్ బూట్' రేసులో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఈ మ్యాచ్ కేవలం లియోనెల్ మెస్సీకి మాత్రమే కాకుండా, అర్జెంటీనా కోచ్ లియోనెల్ స్కలోనీకి కూడా అత్యంత ప్రత్యేకమైనది. 2018లో అర్జెంటీనా జాతీయ జట్టు మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన స్కలోనీ, కోచ్‌గా 100వ అంతర్జాతీయ మ్యాచ్ మైలురాయిని చేరుకున్నారు. స్కలోనీ మార్గదర్శకత్వంలోనే అర్జెంటీనా కోపా అమెరికా, ఫిఫా ప్రపంచకప్ వంటి ప్రతిష్టాత్మక టోర్నీలను గెలుచుకుంది. అర్జెంటీనా, కేప్ వర్డె మధ్య జరిగిన రౌండ్ ఆఫ్ 32 పోరు అత్యంత ఉత్కంఠభరితంగా సాగింది. మ్యాచ్ ప్రారంభం నుంచి అర్జెంటీనా ఆధిపత్యం ప్రదర్శించగా, మెస్సీ 29వ నిమిషంలో గోల్ కొట్టి జట్టును 1-0తో ఆధిక్యంలోకి తీసుకెళ్లారు. ఈ కీలక పోరులో కేప్ వెర్డే జట్టుపై అర్జెంటీనా 3-2 తేడాతో విజయం సాధించింది. దీంతో ఫిఫా ప్రపంచ కప్ రౌండ్ ఆఫ్ 16కు దూసుకెళ్లింది. ఈ రౌండ్ ఆఫ్ 32 నాకౌట్ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా 'రౌండ్ ఆఫ్ 16' (ప్రీ-క్వార్టర్స్) దశకు అర్హత సాధిస్తుంది. డల్లాస్‌లో జరిగిన మరో ఉత్కంఠభరిత నాకౌట్ పోరులో ఆస్ట్రేలియా జట్టును పెనాల్టీ షూటౌట్‌లో ఓడించి ఆఫ్రికన్ దిగ్గజం ఈజిప్ట్ ఇప్పటికే రౌండ్ ఆఫ్ 16కు చేరుకుంది. కాబట్టి ఈ మ్యాచ్‌లో గెలిచిన అర్జెంటీనా జట్టు తదుపరి రౌండ్‌లో క్వార్టర్ ఫైనల్ బెర్త్ కోసం ఈజిప్ట్‌తో తలపడాల్సి ఉంటుంది.

# మ్యాచ్ కు ముందు 'వయాగ్రా' వాడొచ్చు

## ఇంగ్లాండ్ ఫుట్‌బాల్ టీమ్‌కు అనుమతి

ఫిఫా వరల్డ్ కప్ 2026 రౌండ్ ఆఫ్ 32 నాకౌట్ లో డీఆర్ కాంగోను ఓడించిన ఇంగ్లాండ్ టీమ్, ఇప్పుడు రౌండ్ ఆఫ్ 16 లో కో-హోస్ట్ మెక్సికోతో చావో రేవో తేల్చుకోనుంది. జులై 4న జరగబోయే ఈ హై-టెన్షన్ మ్యాచ్ కు ముందే హ్యారీ కేన్ లీడర్‌షిప్ లోని ఇంగ్లాండ్ టీమ్‌కు ఒక ఊహించని సంచలన పర్మిషన్ లభించింది. మెక్సికో నేషనల్ స్టేడియం అయిన ఎస్టాడియో అజ్టెకాలో ప్లేయర్లకు ఎదురయ్యే విపరీతమైన అలసటను తట్టుకోవడానికి వయాగ్రా టాబ్లెట్స్ యూజ్ చేసేందుకు మేనేజర్ థామస్ టుచెల్ కు అఫీషియల్ గా పర్మిషన్ దక్కింది. జనరల్ గా ఫుట్‌బాల్ మ్యాచ్ లలో ఎనర్జీ బార్స్, లిక్విడ్స్ తీసుకోవడం కామన్, కానీ ఇంగ్లాండ్ కు ఇచ్చిన ఈ ఎక్సెప్షన్ ప్రెజెంట్ వరల్డ్ వైడ్ గా హాట్ టాపిక్ అయింది. మెక్సికో సిటీ సముద్ర మట్టానికి ఏకంగా 7,350 అడుగుల కంటే ఎక్కువ హైట్ (ఆల్టిట్యూడ్) లో ఉంది. ఇంత ఎత్తులో ఆక్సిజన్ లెవెల్స్ తక్కువగా ఉండటం వల్ల విదేశీ ప్లేయర్లకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట వచ్చే ఛాన్స్ చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ గ్రౌండ్ లో మెక్సికో టీమ్ కూడా రెగ్యులర్ గా ఆడదు. ఈ హైట్ సవాల్ ను తట్టుకోవడానికి ఇంగ్లాండ్ ప్లేయర్లకు ఈ ఎరెక్టైల్ డిస్‌ఫంక్షన్ డ్రగ్ వయాగ్రా ఒక ఆప్షన్ గా ఇవ్వబడింది. వయాగ్రా బ్లడ్ వెజెల్స్ ను వెడల్పు చేసి రక్త ప్రసరణను పెంచుతుంది కాబట్టి, ఎత్తైన ప్రదేశాలలో ఇది ప్లేయర్ల స్టామినా పడిపోకుండా కాపాడుతుందని మెడికల్ టీమ్ భావిస్తోంది. నాన్-ఫుట్‌బాల్ రీజన్స్ వల్ల మ్యాచ్ ఓడిపోకూడదనే ఇంగ్లాండ్ ఈ బోల్డ్ స్టెప్ వేసింది. ఈ టోర్నమెంట్‌లో మెక్సికో టీమ్ ఆల్రెడీ ఆడిన నాలుగు మ్యాచులూ గెలిచి నెక్స్ట్ లెవెల్ ఫామ్ లో ఉంది. పైగా అజ్టెకా స్టేడియంలో మెక్సికోను ఓడించడం దాదాపు అసాధ్యం.





# అంతర్జాతీయ క్రికెట్‌లోకి వైభవ్ అరంగేట్రం

ప్రపంచ క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. ఐపీఎల్‌తో పాటు, ఇండియా ఏ తరఫున సత్తాచాటిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ .. టీమిండియా తరఫున అరంగేట్రం చేశాడు. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న రెండో టీ20 మ్యాచ్‌లో అతడు టీమిండియా క్యాప్ అందుకున్నాడు. తిలక్ వర్మ చేతుల మీదుగా వైభవ్ సూర్యవంశీ భారత జట్టు క్యాప్ అందుకున్నాడు. ఇక ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్.. తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. వైభవ్ సూర్యవంశీ 15 ఏళ్ల 99 రోజుల వయసులో టీమిండియా తరఫున అరంగేట్రం చేశాడు. దీంతో భారత్ తరఫున డెబ్యూ చేసిన అతి పిన్న వయస్కుడిగా ఈ బుడ్డోడు రికార్డు క్రియేట్ చేశాడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దు అయింది. దీంతో ఇవాళ్టి మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌లో ఆధిక్యంలోకి వెళ్లాలని ఇరు జట్లూ భావిస్తున్నాయి. టాస్ గెలిచిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. సంజూ శాంసన్ ప్లేసులో వైభవ్ తుది జట్టులోకి వచ్చాడు. దీంతో సంజూ బెంచ్‌కే పరిమితమయ్యాడు. కాగా ఐర్లాండ్‌తో టీ20 సిరీస్ సహా.. ఇంగ్లాండ్‌తో తొలి టీ20లో సంజూ శాంసన్ విఫలమయ్యాడు. దీంతో అతడిని తప్పించి.. వైభవ్ సూర్యవంశీని జట్టులోకి తీసుకోవాలని డిమాండ్‌లు వినిపించాయి. కానీ మేనేజ్‌మెంట్ మాత్రం సంజూపై విశ్వాసం ఉంచింది. కానీ రెండో టీ20లో మాత్రం చోటు కల్పించింది. దీంతో క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది.

**తుది జట్లు ఇవే:**

భారత్: వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ, శివమ్ దూబె, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, రవి బిష్ణోయ్, అర్షదీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి

ఇంగ్లాండ్: ఫిల్ సాల్ట్, జాకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్ (కెప్టెన్), టామ్ బాంటన్, విల్ జాక్స్, సామ్ కర్రన్, డాసన్, ఆదిల్ రషీద్, జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

# సాంకేతికతతో సాగు.. భరోసా

భారతదేశం వ్యవసాయాధారిత దేశం. కోట్లాది కుటుంబాలకు వ్యవసాయమే జీవనాధారం. కానీ నేడు రైతు ఎదుర్కొంటున్న సవాళ్లు గతంతో పోలిస్తే మరింత సంక్లిష్టంగా మారాయి. వర్షపాతం అనిశ్చితి, వాతావరణ మార్పులు, పెరుగుతున్న సాగు వ్యయాలు, కూలీల కొరత, మార్కెట్ ధరల్లో ఒడిదుడుకులు రైతును ఆర్థికంగా, మానసికంగా ఒత్తిడికి గురిచేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వ్యవసాయాన్ని లాభసాటిగా, సుస్థిరంగా మార్చగలిగే శక్తి సాంకేతికతలోనే ఉంది. ఒకప్పుడు రైతు నిర్ణయాలు అనుభవం, సంప్రదాయ జ్ఞానంపై ఆధారపడేవి. ఇప్పుడు వాటికి తోడు శాస్త్రీయ సమాచారం, వాతావరణ అంచనాలు, ఉపగ్రహ చిత్రాలు, నేల విశ్లేషణ, మొబైల్ యాప్‌లు, కృత్రిమ మేధ ఆధారిత సలహాలు కూడా చేరుతున్నాయి. దీంతో ఎప్పుడు విత్తాలి? ఎంత ఎరువు వేయాలి? ఏ పురుగు వచ్చే అవకాశం ఉంది? ఎప్పుడు కోత కోయాలి? వంటి నిర్ణయాలను మరింత ఖచ్చితంగా తీసుకునే అవకాశం రైతుకు లభిస్తోంది. ప్రస్తుతం వ్యవసాయంలో డ్రోన్ సాంకేతికత వేగంగా విస్తరిస్తోంది. పురుగుమందులు, ద్రవ ఎరువుల పిచికారీని తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో నిర్వహించగలుగుతోంది. ఇది రసాయనాల వృథాను తగ్గించడంతో పాటు రైతుల ఆరోగ్యాన్నీ కాపాడుతోంది. అలాగే కార్మికుల కొరత ఉన్న ప్రాంతాల్లో డ్రోన్లు ప్రత్యామ్నాయంగా మారుతున్నాయి. కృత్రిమ మేధ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సెన్సార్ సాంకేతికత వ్యవసాయాన్ని మరింత శాస్త్రీయంగా మారుస్తున్నాయి. నేలలో తేమ స్థాయిని కొలిచే సెన్సార్లు, ఆటోమేటిక్ నీటి పారుదల వ్యవస్థలు, వ్యాధులను ముందుగానే గుర్తించే సాంకేతికత రైతుకు సమయానుకూల నిర్ణయాలు తీసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. దీంతో నీటి వినియోగం తగ్గడంతో పాటు దిగుబడులు పెరిగే అవకాశం ఉంది. డిజిటల్ సేవల విస్తరణ కూడా రైతు జీవితంలో గణనీయమైన మార్పు తీసుకొచ్చింది. మొబైల్ ఫోన్ ద్వారానే వాతావరణ సమాచారం, మార్కెట్ ధరలు, ప్రభుత్వ పథకాలు, పంట బీమా, రుణ సదుపాయాలు, వ్యవసాయ నిపుణుల సలహాలు అందుబాటులోకి వస్తున్నాయి. రైతు మార్కెట్‌కు వెళ్లకముందే ధరలు తెలుసుకుని విక్రయ నిర్ణయం తీసుకునే పరిస్థితి ఏర్పడుతోంది. అయితే ఈ సాంకేతిక విప్లవం ప్రయోజనాలు అందరికీ సమానంగా అందడం లేదు. చిన్న, సన్నకారు రైతులకు డ్రోన్లు, ఆధునిక పరికరాలు, డిజిటల్ సేవలు ఇంకా పూర్తిగా అందుబాటులోకి రాలేదు. ఇంటర్నెట్ కనెక్టివిటీ, డిజిటల్ అక్షరాస్యత, సాంకేతిక శిక్షణలో గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా లోటు ఉంది. చాలామంది రైతులు స్మార్ట్‌ఫోన్ వాడుతున్నప్పటికీ వ్యవసాయానికి సంబంధించిన డిజిటల్ సేవలను సమర్థంగా వినియోగించలేకపోతున్నారు. వ్యవసాయంలో సాంకేతికతను విస్తరించాలంటే ప్రభుత్వం, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, ప్రైవేటు రంగం కలిసి పనిచేయాలి. ప్రతి మండలంలో డ్రోన్ సేవా కేంద్రాలు, డిజిటల్ వ్యవసాయ సలహా కేంద్రాలు ఏర్పాటు చేయాలి. రైతులకు స్థానిక భాషలో మొబైల్ యాప్‌లు, వీడియో శిక్షణ, ప్రత్యక్ష ప్రదర్శనలు అందుబాటులో ఉండాలి. వ్యవసాయ విస్తరణ అధికారులను కూడా డిజిటల్ వ్యవసాయంపై మరింతగా తీర్చిదిద్దాలి. తెలంగాణ వంటి రాష్ట్రాల్లో వ్యవసాయాన్ని సాంకేతికతతో అనుసంధానం చేయడానికి విస్తృత అవకాశాలున్నాయి. పత్తి, వరి, మిర్చి, పండ్ల తోటలు, కూరగాయల సాగులో డ్రోన్లు, స్మార్ట్ ఇరిగేషన్, డిజిటల్ పంట పర్యవేక్షణ వంటి విధానాలు రైతుల ఆదాయాన్ని పెంచగలవు. అదే సమయంలో స్థానిక అవసరాలకు అనుగుణంగా తక్కువ ఖర్చుతో సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేయడం కూడా అవసరం. భవిష్యత్తులో వ్యవసాయం కేవలం ఎక్కువ పంట పండించడం గురించే కాదు. తక్కువ నీటితో, తక్కువ ఖర్చుతో, తక్కువ పర్యావరణ నష్టంతో అధిక నాణ్యత ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా మారనుంది. ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి సాంకేతికత అనివార్యం.

# ఈ-జాగృతి: వినియోగదారుడికి సంపూర్ణ రక్షణ




**న్యాయ ప్రదానంలో జాప్యం భారత వినియోగదారులను చిరకాలం నుంచీ మనస్తాపానికి గురిచేస్తున్న సమస్య. ఉత్పత్తి లోపభూయిష్టమైనదైనా, ఆన్‌లైన్ కొనుగోలు ద్వారా వస్తువు అందకపోయినా ఏకపక్ష సేవా ఒప్పందమైనా.. ఫిర్యాదు నుంచి ఉపశమనం దాకా సాగే తంతు ఎంతో నిదానంగా, ప్రయాసాయాసాలకు గురిచేసేదిగా ఉండేది. దేశంలో వినియోగదారు రక్షణ వ్యవస్థ ఏళ్ల తరబడి కొనసాగుతున్నా, డిజిటలీకరణ వైపు వేగంగా సాగే ఆర్థిక వ్యవస్థలోని వాస్తవాలకు అనుగుణంగా మద్దతు వ్యవస్థల్లో మార్పు లేకపోవడం గమనార్హం.**

**వినియోగదారులు నేడు ఈ-కామర్స్ వేదికలు, డిజిటల్ చెల్లింపు వ్యవస్థలు, ఆన్‌లైన్ మార్కెట్లలో అసాధారణ స్థాయిలో లావాదేవీలు నిర్వహిస్తున్నారు. అందువల్ల వ్యక్తిగత విచారణ కేంద్రకంగా గల సంప్రదాయ వినియోగదారుల న్యాయ వ్యవస్థకు భౌతిక ఫైలింగ్, మానవ పరిశీలన, ఏకీకృతం కాని సాఫ్ట్‌వేర్ వేదికలు సరిపోవడం లేదు. నేటి డిజిటల్ యుగంలో వినియోగదారుల హక్కులకు భరోసా ఇవ్వడం కోసం న్యాయప్రదానంలో శాసన సంస్కరణలకు మించి పూర్తి రూపాంతరీకరణ అవశ్యం.**

**ఇలాంటి కీలక సంధి దశలోనే ఈ-జాగృతి ఓ ప్రధాన పరిణామాన్ని స్పష్టం చేస్తుంది. ఇది సాంకేతిక వేదికను మించి పరిపాలన సౌలభ్యం, పారదర్శకత, సామర్థ్యానికి ప్రాధాన్యంతో వినియోగదారు వివాద పరిష్కార విధానం రూపురేఖలను మార్చేస్తుంది.**

**ఈ నేపథ్యంలో పురోగమిస్తున్న మార్కెట్ వాస్తవాలపై చురుగ్గా ప్రతిస్పందించే ఒక ఆధునిక చట్రాన్ని వినియోగదారుల రక్షణ చట్టం-2019 నిర్దేశించింది. అయితే, శాసన సంకల్పాన్ని సమర్థ ప్రజా సేవ వైపు మళ్లించడానికి చెల్లాచెదరుగా గల అనేక పాత వ్యవస్థల స్థానంలో ఏకీకృత డిజిటల్ వ్యవస్థను తేవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఇంతకుముందటి దాకా పాత వేదికలన్నీ అస్థిర పని విధానం, కాలం చెల్లిన స్వరూపం, పరిమిత పరస్పర అనుసంధానం, మాన్యువల్ ప్రక్రియలపై అధికంగా ఆధారపడటం వంటి సమస్యలతో కునారిల్లాయి. అనేకమంది వినియోగదారులు... ముఖ్యంగా గ్రామీణులు, వయోవృద్ధులు, దివ్యాంగులు, ప్రవాస భారతీయులందరికీ న్యాయ సౌలభ్య వ్యయం అనేక సందర్భాల్లో ఒక అడ్డంకిగా మారుతోంది.**

**వినియోగదారుల ఫిర్యాదు సంబంధిత ప్రక్రియ మొత్తాన్నీ డిజిటలీకరించడం ద్వారా ఈ వ్యవస్థాగత సవాళ్లను 'ఈ-జాగృతి' పరిష్కరిస్తుంది. ఈ మేరకు ఓటీపీ ఆధారిత రిజిస్ట్రేషన్, ఆన్‌లైన్ దాఖలు నుంచి డిజిటల్ పరిశీలన, ఎలక్ట్రానిక్ చెల్లింపులు, వర్చువల్ విచారణ, బహుభాషా ఉత్తర్వులు సహా కేసుపై ప్రత్యక్ష పర్యవేక్షణ దాకా ఈ వేదికను భౌగోళిక పరిమితులు లేదా విధానపరమైన సంక్లిష్టత లేకుండా పౌరులు న్యాయం పొందడానికి ఇది వీలు కల్పిస్తుంది.**



వ్యాసకర్త: ప్రహ్లాద్ జోషి
కేంద్ర మంత్రి

సౌకర్యం కన్నా ఇలాంటి రూపాంతరీకరణకు అధిక ప్రాధాన్యముంది. పౌరులకు, ప్రభుత్వ వ్యవస్థలకు మధ్యగల సంబంధాన్ని ఇది మౌలికంగా మార్చివేస్తుంది. డిజిటల్ కార్యాచరణతో కాగితపు పనిభారం తగ్గుతుంది. వివిధ అధికార పరిధులలో విధానాల ప్రామాణికీకరణతోపాటు విచక్షణ రహిత జాప్యాలు ఉపశమించి, పారదర్శకత మెరుగవుతుంది. స్వయంచలిత కేసు విచారణ జాబితా, ఆన్‌లైన్ డాష్‌బోర్డులు, తక్షణ నోటిఫికేషన్లు వంటివన్నీ న్యాయ ప్రక్రియలో ఆసాంతం కక్షిదారులకు సమాచారం లభించేలా చేస్తాయి. తద్వారా వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం కూడా బలపడుతుంది.

న్యాయ ప్రదానాన్ని మరింత సార్వజనీనం చేసే దిశగా నవ్య సాంకేతికతలను కూడా ఈ వేదిక స్వీకరించింది. ఏఐ ఆధారిత కేసు విశ్లేషణ, గళం నుంచి వచనం (వాయిస్-టు-టెక్స్ట్) ప్రక్రియ, వచనం నుంచి గళం మద్దతు, (టెక్స్ట్-టు-స్పీచ్ సపోర్ట్), బహుభాషా సంధానం, ఆధునిక శోధక సామర్థ్యం, సాధన సౌలభ్యం వంటివి సమాజంలోని విభిన్న వర్గాల విస్తృత భాగస్వామ్యాన్ని సాధ్యం చేస్తున్నాయి. ముఖ్యంగా జాతీయ, రాష్ట్రస్థాయి వినియోగదారు వివాదాల పరిష్కార కమిషన్లకు ప్రభుత్వం హైబ్రిడ్ వీడియో కాన్ఫరెన్సింగ్ సదుపాయం కల్పించింది. వినియోగదారులకు న్యాయ ప్రదానంలో ఇప్పుడిది ఆన్‌లైన విచారణను అంతర్భాగం చేసింది. తద్వారా మారుమూల జిల్లాల్లో లేదా విదేశాల్లో నివసించే పౌరులకు వ్యాజ్యాలతోపాటు ఆర్థిక, లాజిస్టిక్ వ్యయాలను గణనీయంగా తగ్గించింది. అయితే, ఈ స్థాయిలో సవాళ్లకు తావులేని సాంకేతిక రూపాంతరీకరణ సుసాధ్యమేమీ కాదు. ఆ మేరకు వివిధ వ్యవస్థలలో స్థిరంగా కొనసాగుతున్న పద్ధతులపై పునరాలోచనకు తావిస్తూ, వినియోగదారులు కొత్త వ్యవస్థలను ఆమోదించే విధంగా డిజిటల్ సంస్కరణలు తరచూ ప్రోత్సహిస్తాయి.

ఈ-జాగృతిని ప్రారంభించే సమయంలో డేటా మైగ్రేషన్, పేమెంట్ గేట్‌వే ఇంటిగ్రేషన్, ఇంటర్‌ఫేస్ వినియోగం, దీర్ఘకాలిక మానవ ప్రమేయ ప్రక్రియల నుంచి మార్పులపై ఆందోళన వ్యక్తమైంది. తదనుగుణంగా న్యాయవాదులలోని కొన్ని వర్గాలు, ఇతర భాగస్వాములు కొత్త డిజిటల్ వాతావరణానికి అలవాటు పడే క్రమంలో సహజంగానే అభ్యంతరాలను వ్యక్తం చేశారు.

ఈ సమస్యలు అవరోధాలుగా మారకుండా అమలు ప్రక్రియ వాటిని నిరంతర అభివృద్ధికి అవకాశాలుగా పరిగణిస్తూ వచ్చింది. వినియోగదారు కమిషన్లు, న్యాయవాదులు, సాంకేతిక నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వాలతో విస్తృత సంప్రదింపుల ద్వారా ఈ వేదిక మెరుగుడింది. క్రమం తప్పని సామర్థ్య వికాస కార్యక్రమాలు, ప్రాంతీయ కార్యశాలలు, వర్చువల్ శిక్షణ సదస్సులు, వారం ఆరంభంలో ఫిర్యాదుల పరిష్కార సంప్రదింపులు, నిరంతర సాంకేతిక మద్దతు వంటి విశిష్టతల వల్ల కొత్త వ్యవస్థపై భాగస్వాములు క్రమంగా విశ్వాసం పెంచుకునే వీలు ఏర్పడింది. ఈ అనుభవం ఓ కీలక పాఠం నేర్పింది... అంటే- డిజిటల్ రూపాంతరీకరణ కేవలం సాంకేతికత వినియోగంతోనే విజయవంతం కాబోదని తేల్చింది. వివిధ వ్యవస్థలు వినియోగదారుల అభిప్రాయాలపై స్పందిస్తూ మెరుగుదల పునరావృతమయ్యేలా కట్టుబడితేనే అది సాధ్యం.

ఈ నేపథ్యంలో ఆరంభ ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉన్నాయి... స్వల్ప వ్యవధిలోనే లక్షలాది వినియోగదారులను ఈ-జాగృతి ఒకే ఉమ్మడి డిజిటల్ వేదికపైకి తెచ్చింది. తదనుగుణంగా 2 లక్షలకు పైగా కేసుల దాఖలు సౌలభ్యం కల్పించడంతోపాటు అధిక పరిష్కార శాతం నమోదు చేసింది. అలాగే, 60కి పైగా దేశాల వినియోగదారులు భారత వినియోగదారు వివాద పరిష్కార యంత్రాంగాన్ని వినియోగించుకునేలా చేసింది. ప్రామాణిక డిజిటల్ కార్యాచరణ నిర్దేశం సహా ఈ వ్యవస్థకు గతకాలపు విధానపరమైన అడ్డంకులను తొలగిస్తూ సామర్థ్యాన్ని మెరుగుపరచింది.

ఈ క్రమంలో 'నేషనల్ అవార్డ్స్ ఫర్ ఈ-గవర్నెన్స్-2026'లో రజత పురస్కారం ద్వారా లభించిన గుర్తింపు కేవలం సంస్థాగత విజయానికి పరిమితం కాలేదు. ప్రభుత్వ ప్రక్రియల పునర్వ్యవస్థీకరణలో విజయానికి లభించిన అంగీకారంగానూ ఈ అవార్డుకు ఎంతో ప్రాధాన్యం ఉంది. అర్థవంతమైన డిజిటల్ పాలనంటే ఇప్పటికే గల ప్రక్రియల కంప్యూటరీకరణ కాదని- వాటిని మరింత సరళ, సత్వర, పౌర కేంద్రకంగా పునఃరూపకల్పన చేయడమేనని ఈ అవార్డు స్పష్టం చేసింది.

బలమైన సంస్థాగత నిబద్ధత తోడైతే సాంకేతికత ప్రజా సేవల ప్రదానం పూర్తిగా రూపాంతరం చెందుతుందని భారత విస్తృత డిజిటల్ ఇండియా ప్రస్థానం నిరూపించింది. డిజిటల్ గుర్తింపు, ప్రత్యక్ష లబ్ధి బదిలీ నుంచి ఆన్‌లైన్ పన్నులు, ఆరోగ్య సంరక్షణ వేదికల దాకా దేశ పరిపాలనలో సాంకేతికత పాత్ర క్రమంగా విస్తరించింది. నిర్మాణాత్మక డిజిటల్ సంస్కరణలు నిరంతరం చోటు చేసుకుంటున్న రంగాల జాబితాలో ఇప్పుడు వినియోగదారు న్యాయ ప్రదానం కూడా చేరింది.

ఈ-జాగృతి విజయం భావితరం పాలన సంస్కరణలకూ విలువైన అనుభవాలను సమకూర్చింది. డిజిటల్ వేదికలను సంస్థల ప్రాతిపదికన కాకుండా పౌర కేంద్రకంగా రూపొందించాలి. అందుబాటును ఒక అదనపు అంశంగా కాకుండా ప్రధాన సూత్రంగా పరిగణించాలి. కృత్రిమ మేధ నిష్పక్షపాతానికి భంగం కలిగించకుండా పారదర్శకతను, సామర్థ్యాన్ని ఇనుమడింపజేయాలి. అన్నింటినీ మించి, సాంకేతికత కొత్త సంక్లిష్టతలను జోడించేదిగా కాకుండా న్యాయ ప్రదానాన్ని సరళం చేసేదిగా ఉండాలి.


భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థ నిరంతం విస్తరిస్తూనే ఉంటుంది కాబట్టి, వినియోగదారు హక్కుల పరిరక్షణ సంస్థల విశ్వసనీయతపై వారి విశ్వాసం అంతకంతకూ పెరగడమన్నది ఆధారపడి ఉంటుంది. సమర్థ వివాద పరిష్కారం ఇకపై పరిపాలన లక్ష్యానికి మాత్రమే కాకుండా మార్కెట్లపై నమ్మకాన్ని బలపరుస్తూ, బాధ్యతాయుత వ్యాపార పద్ధతులను ప్రోత్సహించే ఒక ఆర్థిక ఆవశ్యకతగా రూపొందాలి.

శాసన సంకల్పానికి, పౌరుల అనుభవానికి మధ్య గల అంతరాన్ని సునిశితమైన డిజిటల్ రూపాంతరీకరణ పూడ్చగలదని 'ఈ-జాగృతి' నిరూపిస్తుంది. వినియోగదారులకు మరింత పారదర్శకంగా, సార్వజనీనంగా, సత్వర న్యాయ ప్రదానం ద్వారా ఇదొక సరళ, సశక్త సూత్రాన్ని విదితం చేస్తుంది. అదేమిటంటే- డిజిటల్ ప్రజాస్వామ్యంలో సేవల ప్రదానంలో ఎంత సౌలభ్యం ఉంటుందో... న్యాయం కూడా అంతే సులభంగా అందుబాటులోకి రావాలి. నేటి 21వ శతాబ్దంలో 'వినియోగదారులే దేవుళ్లు' (గ్రాహక్ దేవో భవ)కు ఇంతకు మించిన అర్థవంతమైన వ్యక్తీకరణ మరొకటి ఉండదంటే అతిశయోక్తి కాబోదు.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.